సింగరేణి కార్మికులకు పండుగ కానుక

- దీపావళి బోనస్ ప్రకటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రూ.400కోట్లు వెచ్చిస్తూ ఉత్తర్వులిచ్చిన సంస్థ
- నేడు ఖాతాల్లో జమకానున్న డబ్బులు

కొత్తగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సంస్థ దీపావళి కానుకను ప్రకటించింది. ఈ మేరకు వారి ఖాతాల్లో శనివారం దీపావళి బోనస్ జమకానుంది. పనితీరు ఆధారిత రివార్డ్ (పెర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డ్ స్కీం- పీఎల్ఆర్) కింద ఈ మొత్తాన్ని అర్హత కలిగిన వారికి బోనస్ చెల్లింపునకు సింగరేణి యాజమాన్యానికి డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీచేశారు. ఆయన ఆదేశాలకనుగుణంగా దీపావళి బోనస్ చెల్లించనున్నట్టు సంస్థ సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. బోనస్‌కు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం విడుదల చేయగా.. గత నెల 25న న్యూఢిల్లీలో సీఐఎల్ కార్యాలయంలో జరిగిన ఆరో ప్రమాణీకరణ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం రూ.1.03లక్షలను బోనస్‌గా చెల్లించాలని నిర్ణయించారు. కాగా 2024-25 సంవత్సరానికి సంబంధించి ఉపరితల గనుల్లో పనిచేసే ఉద్యోగులు 240 రోజుల హాజరు, భూ గర్భ గనుల్లో పనిచేసే వారికి 190రోజుల హాజరును పరిగణించనున్నారు. అంతకంటే తక్కువ పని దినాలు పూర్తి చేసిన వారికి నిష్పత్తి ప్రకారం బోనస్‌ను చెల్లిస్తారు. 30 మస్టర్లు పూర్తి చేసిన వారు బోనస్ పొందడానికి అర్హులుగా పరిగణించనుండగా.. హింసాత్మక ప్రవర్తన, కంపెనీ ఆస్తిని విధ్వంసం చేయడం వంటి కారణాలతో సర్వీస్ నుంచి తొలగించిన ఉద్యోగులు, ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలగించబడినా అనర్హులుగా పరిగణించబడతారని, అలాంటి ఉద్యోగులు ఎవరైనా తిరిగి సర్వీస్ కొనసాగింపులో తిరిగి నియమించబడితే వారు ఈ చెల్లింపులకు అర్హులుగా పరిగణించనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా సింగరేణి వ్యాప్తంగా సుమారు 39,500మంది కార్మికులకుగాను సింగరేణి రూ.400కోట్లు చెల్లించనుంది. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్‌ను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం, డిప్యూటీ సీఎంలకు సీఎండీ సింగరేణి కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఆయన ఉద్యోగులకు తన దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ బోనస్ సొమ్మును కుటుంబ అవసరాలకు సద్వినియోగం చేయాలని లేదా ప్రభుత్వ పొదుపు సంస్థల్లో పొదుపు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

భక్తికి మార్గం.. కార్తీక మాసం

- 22 నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం
- శివాలయాల్లో విస్తృత ఏర్పాట్లు

7

పటాసుల పండుగ దీపావళి వస్తే చాలు అందరికీ ఆనందమే. ప్రతీ ఒక్కరు టపాసులు కొని ఇళ్ల ముందు కాల్చేందుకు సిద్ధమవుతారు. కానీ ఇదే అదనుగా టపాసులను అధిక ధరకు అమ్ముకునేందుకు కొందరు అక్రమార్కులు దందా షురూ చేశారు. ఈ క్రమంలో అధికారులు కూడా ధరల విషయంలో తమకు ఎలాంటి సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా రేట్లు ముద్రించి 50శాతం రాయితీ అంటూ ప్రజలను మోసం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సాధారణ, మధ్యతరగతి వారికి దీపావళి టపాసుల కొనుగోలు భారంగా మారుతోంది.



ఖమ్మం పెవిలియన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లు

దీపావళి దోపిడీకి.. వేళాయే!

టపాసుల పండగొస్తే చాలు.. అక్రమార్కుల దందా షురూ

- లైసెన్సు లేకుండా, పన్నులు చెల్లించకుండా వ్యాపారం
- ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి
- జిల్లాలో ఏటా రూ.50కోట్ల వరకు టర్నోవర్

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ వేళ ఈసారి కూడా కొందరు వ్యక్తులు అక్రమాలకు తెర తీస్తున్నారు. టపాసుల విక్రయాల మాటున కోట్లాది రూపాయలను వెనకేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. పండుగ సందర్భంగా రూ.కోట్ల విలువ చేసే టపాసుల విక్రయాలు సాగుతాయి. తమిళనాడులోని శివకాశి తదితర ప్రాంతాల నుంచి టపాసులను తక్కువ ధరకు తీసుకొచ్చే వ్యాపారులు, ప్రజలకు అధిక ధరలకు విక్రయించి, భారీగా లబ్ధి పొందుతున్నారు. ఫలితంగా పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వాలకు అందాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. పన్ను ఎగ్గొట్టేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు. రెగ్యులర్ లైసెన్సులు కలిగిన డీలర్లు 25శాతం మాత్రమే పన్ను చెల్లించి, మిగిలిన మొత్తానికి టోకరా వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మరికొందరు లైసెన్స్ లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. వాస్తవానికి టపాసుల విక్రయదారులు పన్నుల శాఖకు 18శాతం చెల్లించాలి.

ఏటా రూ.50కోట్లపైనే వ్యాపారం..

జిల్లా వ్యాప్తంగా ఏటా రూ.50కోట్ల పైచిలుకు వ్యాపారం జరుగుతుందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. దీపావళి సందర్భంగా మూడురోజుల్లోనే రూ.20కోట్ల నుంచి రూ.30కోట్ల వరకు అమ్మకాలు సాగుతాయి.పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు, వేడుకల సందర్భంలో రూ.20కోట్ల పైగానే టపాసులు విక్రయిస్తుంటారు. పన్ను చెల్లించకుండా వ్యాపారం నిర్వహిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. కొందరికి పెద్ద మొత్తంలో మామూళ్లు ముడుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఖమ్మం నగరంలో మొత్తం 148మంది దుకాణాలకు దరఖాస్తులు చేసుకోగా అధికారులు డ్రా పద్ధతిలో 128 షాపులకు అనుమతులు ఇచ్చారు. గతంలో సర్దార్ పటేల్ స్టేడియంలో టపాసుల దుకాణాలకు అనుమతిచ్చేవారు, కానీ ఈ ఏడాది పెవిలియన్ గ్రౌండ్‌లో కూడా కొన్ని షాపులకు అనుమతిచ్చారు. దీంతో టపాసుల దుకాణాలకు అధికారులు షెడ్ల నిర్మాణం పూర్తి చేసి శనివారం దుకాణాదారులకు అప్పగించనున్నారు. జిల్లాలో టపాసుల విక్రయానికి సంబంధించి ఎంత మందికి రెగ్యులర్ లైసెన్స్ ఉందనే ప్రశ్నకు అధికారుల వద్ద కూడా సమాధానం లేదు. వివిధ ప్రాంతాలనుంచి తెచ్చిన టపాసుల్లో 80శాతం బిల్లులు లేకుండా వ్యాపారం చేస్తున్నా... సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.



ఆధునిక పద్ధతిలో విత్తనాలను నాటుతున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి

ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రానిదే అగ్రస్థానం

- త్వరలోనే అనుబంధ పరిశ్రమల హబ్‌గా తెలంగాణ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఆధునిక పద్ధతిలో పామాయిల్ విత్తనాన్ని నాటిన మంత్రి
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, మార్పులపై అవగాహన

అశ్వారావుపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉండబోతోందని, సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక పద్ధతులు, నాణ్యమైన విత్తనం ఎంపిక ద్వారా నెంబర్‌వన్ దిశగా దూసుకుపోతోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అశ్వారావుపేట ఆయిల్‌పామ్ డివిజన్ కార్యాలయంలో ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆధునిక పద్ధతుల్లో ఆయిల్‌పామ్ విత్తనాలు నాటే పద్ధతి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం తుమ్మల మాట్లాడుతూ త్వరలోనే ఆయిల్‌పామ్ విస్తీర్ణంలో ఏపీని దాటి తెలంగాణ దేశంలో నెంబర్‌వన్‌గా నిలవబోతోందని, పామాయిల్‌లో వచ్చే జ్ఞానోడెర్మా లాంటి తెగుళ్లను నివారించడానికి నాణ్యమైన విత్తనాన్ని, అధిక దిగుబడులను ఇచ్చే పొట్టి, హైబ్రీడ్ రకాల ఎంపిక ఎంతో ముఖ్యమైందన్నారు. ఎప్పటికప్పుడు రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు, ప్రత్యేక బృందాలను అందించడంతో ద్వారా రైతుల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్క రైతుకు నాణ్యమైన మొక్కను అందించాలనే ఉద్దేశ్యంతో మొక్కల పెంపకం, క్వాలిటీ గుర్తింపు, ఎరువులు, యాజమాన్య పద్ధతులు, మార్కెటింగ్, ఫ్యాక్టరీ విభాగాలలో నిష్ణాతులను నియమించడం జరిగిందన్నారు. మలేషియా తరహాలో వార్మ్ విధానంలో విత్తనాలు నాటి నాణ్యమైన (మిగతా 6వ పేజీలో)

ఖమ్మంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.220 కోట్లు మంజూరు

- ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరానే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ముస్తఫానగర్‌లో బీసీ వసతి గృహ పనులకు శంకుస్థాపన

7

ఖమ్మానికి ఏపీ వీఐపీలు!

- మద్యం దరఖాస్తుల చివరి రోజుల్లో హడావిడి
- రెస్టారెంట్లు, హోటళ్లు ఫుల్
- సవాల్ విసురుతున్న గ్రామీణ తరహా సిండికేట్

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి అనూహ్యంగా కొత్త వీఐపీల తాకిడి కనిపిస్తోంది. మద్యం షాపుల దరఖాస్తుల దాఖలుకు గడువు సమీపించడంతో.. ఏపీకి చెందిన ఆశావహులు ఖమ్మం నగరానికి భారీగా చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచే నగరంలోని ప్రధాన రెస్టారెంట్లు, హోటళ్లలో బస చేశారు. అక్కడి నుంచే మద్యం టెండర్లకు సంబంధించిన వివరాలను సేకరించారు. రిజర్వేషన్ దుకాణాలు, తక్కువగా దరఖాస్తులు వచ్చిన షాపులు, ఎక్కువ డిమాండ్ ఉన్న దుకాణాల వివరాలను సేకరించారు. మధ్యాహ్నం నుంచి మద్యం టెండర్ల దరఖాస్తులు వేగవంతం అయ్యాయి. రెండురోజుల క్రితం వెలవెలబోయిన మద్యం టెండర్ కౌంటర్లు.. శుక్రవారం రాత్రివరకు క్యూలో ఉండి మరీ దరఖాస్తులు అందించారు. దరఖాస్తు ప్రక్రియ శనివారం ముగియనుంది.



స్టేషన్ వద్ద దరఖాస్తుదారుల క్యూ

గడువు పెంపు ప్రచారాన్ని నమ్మొద్దు

జనార్దన్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మద్యం టెండర్లకు శనివారంతో తుది గడువు. గడువు పెంపుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొంతమంది మాత్రం గడువు పెంచుతారని ప్రచారం చేస్తున్నారు. వాటిని నమ్మొద్దు. ఆసక్తి గల వారు నిర్ణీత గడువులోగా దరఖాస్తులు అందించాలి.

గ్రామీణ స్థాయిలో సిండికేట్

గత మద్యం టెండర్లలో తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు గ్రామానికి చెందిన రైతులు, వ్యవసాయ కూలీలు, డ్వాక్రా సంఘాల సభ్యులు మొత్తం 20 మంది కలిసి ఒక సిండికేట్‌గా ఏర్పడ్డారు. ప్రతీ ఒక్కరు రూ.15,150 చొప్పున డబ్బులు జమ చేసి రఘునాథపాలెం, పిండిప్రోలు, ఏదులాపురం, వెంకటగిరి క్రాస్ రోడ్డు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశారు. అయితే వీరికి రఘునాథపాలెం మద్యం దుకాణం దక్కింది. ఆ దుకాణాన్ని రూ.1.50 కోట్లకు అమ్మకాలు జరిపారు. వచ్చిన లాభాన్ని అందరూ పంచుకున్నారు. ఇప్పుడు (మిగతా 8వ పేజీలో)

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రావొద్దు

- మెరుగైన సరఫరాకు జిల్లాలో రెండు 400 కేవీ సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- త్వరలో విద్యుత్‌శాఖ సిబ్బందికి ప్రత్యేక యూనిఫాం
- సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంపునకు పక్కా ప్రణాళిక
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- ఉమ్మడి ఖమ్మం, వరంగల్ అధికారులతో సమావేశం

ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గృహ వినియోగ విద్యుత్ సరఫరాల్లో అంతరాయాలు రావొద్దని, మెరుగైన విద్యుత్ సరఫరా లక్ష్యంగా ఖమ్మంజిల్లాకు 400కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు రెండు మంజూరు చేస్తున్నట్టు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ఇందిర సౌర గిరి జలవికాసం కింద సోలార్ పంపుసెట్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని, ఖాళీ భూముల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేయాలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 అమల్లో విద్యుత్‌శాఖ కీలకపాత్ర పోషించేలా సంస్థను బలోపేతం చేయడంతోపాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కొన్నేళ్లుగా విద్యుత్‌శాఖలో పదోన్నతులు, బదిలీలు జరగలేదని, ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్నారు. ఇటీవల డైరెక్టర్ల నియామకం కూడా చేశామని తెలిపారు. లైన్‌మెన్‌నుంచి సీఎండీవరకు ప్రతీ ఒక్కరు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తే సత్ఫలితాలు వస్తాయని, ఎన్పీడీసీఎల్ సిబ్బందికి త్వరలో యూనిఫాం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ అంబులెన్సుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు సిబ్బంది, 1912 టోల్‌ఫ్రీనెంబర్ ఏర్పాటుచేశామని, తాను కూడా ఆ నెంబర్‌కు ఫోన్‌చేసి సమస్య చెబుతానని, శాఖ పనితీరు, స్పందన గురించి తెలుసుకుంటానన్నారు. ఇందిర సౌరగిరి జలవికాస్ కింద సోలార్‌పంపుసెట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆర్వోఆర్ పట్టాలకు సాగునీరు (మిగతా 6వ పేజీలో)



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్

సత్తుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందాలని ఉద్యోగులకు ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్ అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డులను శుక్రవారం ఖమ్మంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్‌ఎం సరిరాంతో కలిసి ఈడీ అందజేశారు. ఇదేస్ఫూర్తిని కొనసాగిస్తూ దసరా పండుగ వలనే వచ్చే దీపావళికి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించి డిపోకు ఆదాయం చేకూర్చేందుకు కృషి చేయాలని తెలిపారు. సాధ్యమైనంత మేరకు ఆర్టీసీ సేవలను ప్రయాణీకులకు అందుబాటులో ఉంచుతూనే అన్ని ప్రాంతాలకు సమయానుకూలంగా బస్సులు నడిపించేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయడంతో పాటు ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలని ఉద్యోగులకు ఈడీ సూచించారు. అనంతరం సత్తుపల్లి డిపో చరిత్రలో ఎన్నడూ లేని విధంగా దసరా రూ.4.40కోట్లు ఆదాయం వచ్చిన సందర్భంగా డిపో మేనేజర్ ఊటుకూరి సునీతను ఈడీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శన కనబరిచిన జీ.బాలరాజు, జీ.విజయరాణి, కే.ఉపేందర్, కేఎం. కృష్ణలకు అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు.



సత్తుపల్లి ఆర్టీసీ ఉద్యోగులను అభినందిస్తున్న ఈడీ సోలమన్



వైరా మునిసిపాలిటీలో.. అవినీతి కంపు

- సెల్ఫ్ చెక్కులతో రూ.54లక్షల స్వాహా
- ప్రత్యేక అధికారిగా ఐఏఎస్ అధికారి
- అయినా ఆగని అవినీతి
- ఆర్‌డీఎంఏ విచారణతోనైనా అడ్డుకట్ట పడేనా?
- జూనియర్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు

వైరా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వయానా ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి అయిన మల్లు భట్టి విక్రమార్క సొంత మండలం ఉన్న వైరా మునిసిపాలిటీలో అవినీతి కంపు కొడుతుంది. ఏడేళ్ల నుంచి మునిసిపాలిటీలో యథేచ్ఛగా అక్రమాలు కొనసాగుతున్నా యి. ఇప్పుడు ఏకంగా మునిసిపాలిటీలో 30సెల్ఫ్ బ్యాంకు చెక్కులతో రూ.54 లక్షల నిధులను స్వాహా చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఏడేళ్లుగా రూ.కోట్లల్లో అవినీతి జరుగుతున్నా ఉన్నతాధికారులు ఒక్కరిపైనా కనీస చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మునిసిపల్ ప్రత్యేక అధికారిగా ఉన్న సమయంలోనే.. స్వాహా పర్వం జరగడం విస్మయానికి గురిచేస్తోంది.

సెల్ఫ్ చెక్కులపై రూ.54 లక్షల నిధులు డ్రా

వైరా మునిసిపాలిటీలో ఎలాంటి అజమాయిషీ లేకుండా ఇన్‌చార్జ్ జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేసిన అయితంరాజు వెంకటేశ్వర్లు నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట 30చెక్కులు రాసుకొని రూ.54లక్షలకుపైగా నిధులను బ్యాంకు నుంచి డ్రా చేశారు. వెంకటేశ్వరరావు స్థానంలో పూర్తిస్థాయి జూనియర్ అకౌంటెంట్‌గా బాధ్యతలు చేపట్టిన కిరణ్ రికార్డులను పరిశీలించి తమ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఈ అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇటీవల పురపాలకశాఖ వరంగల్ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీఎంఏ) సాహిద్ మసూద్ జరిపిన విచారణలో అవినీతి బాగోతం నిర్ధారణైంది. పలు పనులు, కార్యక్రమాల పేరిట నగదు కాజేసినట్లు గుర్తించారు. అసిస్టెంట్ జేఏవో వెంకటేశ్వరరావు తన పేరిట రాసుకున్న చెక్కుల్లో సగం వాటి వివరాలను క్యాష్ బుక్‌లో నమోదు చేయలేదని తేలింది. ఈ సెల్ఫ్ చెక్కుల బాగోతంపై ఆడిట్‌శాఖ అధికారులతో తనిఖీ చేయించి లిఖితపూర్వక నివేదిక అందించాలని వైరా మునిసిపల్ కమిషనర్ గురులింగాన్ని ఆర్డీఎంఏ ఆదేశించారు. ఈ ఏడాది ఆగస్టు ఆరో తేదీకి ముందు ఇన్‌చార్జ్ జేఏవోగా వార్డు ఆఫీసర్ వెంకటేశ్వరరావు విధులు నిర్వర్తించిన సమయంలో ఈ సెల్ఫ్ చెక్కుల బాగోతం నడిచింది. అప్పటి కమిషనర్ జేఏవో వెంకటేశ్వరరావు సెల్ఫ్ చెక్కులను అడ్డుకోకుండా సంతకాలు చేసి బ్యాంకు నుంచి నిధుల డ్రాకు సహకరించారు. ప్రస్తుత జేఏవో కిరణ్ ఆగస్టులో ఇక్కడ విధుల్లో చేరిన తర్వాత ఈ సెల్ఫ్ చెక్కుల బాగోతం వెలుగులోకి వచ్చింది. అయితే సెల్ఫ్ చెక్కులతో రూ.2కోట్ల సాధారణ నిధుల్లోనుంచి రూ.54లక్షల నిధులను బ్యాంకు నుంచి డ్రా చేసిన అయితంరాజు వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆమేరకు వరంగల్ ఆర్డీఎంఏ షాహిద్ మసూద్ శుక్రవారం సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేశారు. వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసిన అధికారులు దీనికి బాధ్యులైన అప్పటి కమిషనర్, మరో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఏడేళ్ల నుంచి విచ్చలవిడిగా అవినీతి

వైరా మునిసిపాలిటీకి పాలకవర్గం ఉన్న ఐదేళ్లూ, అలాగే ప్రత్యేక అధికారులు ఉన్న మిగిలిన సమయాల్లో కూడా అవినీతికి (మిగతా 8వ పేజీలో)

క్రీడా సమాచారం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

లక్ష్యం సాధించే వరకూ విశ్రమించొద్దు

ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని సాధించే వరకూ క్రీడాకారులు విశ్రమించకూడదని ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శుక్రవారం ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాలలో డివిజన్ స్థాయి గిరిజన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు నచ్చిన క్రీడల్లో పాల్గొని తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. క్రీడాకారుల భవితకు గిరిజన సంక్షేమశాఖ నుంచి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి చెందినంత మాత్రాన నిరుత్సాహ పడకుండా గెలవడానికి ప్రయత్నించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి టెన్నికాయిట్, వాలీబాల్ క్రీడలను ఆడి వారిని ఉత్సాహ పరిచారు. క్రీడాపోటీల్లో పాల్గొనే విద్యార్థులకు పూర్తి సదుపాయాలను కల్పించాలన్నారు.జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పథకాలను సాధించి భద్రాచలం ఐటీడీఏకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని అన్నారు. పీఈటీలు విద్యార్థులకు ఇష్టమైన క్రీడల్లో తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఇంచార్జి డీడీ అశోక్, హెచ్‌ఎంలు సోమశేఖర్, నర్సింహారావు, శ్రీనివాసరావు, క్రీడల కార్యదర్శి వసంత్, పీడీలు హరికృష్ణ, వెంకటేశ్వర్లు, జయ, పీఈటీలు వెంకటేశ్వర్లు, బాబూరావు, పార్వతి, టీచర్లు పాల్గొన్నారు.

ప్రోత్సాహం అందిస్తాం.. ప్రతిభ చూపండి..

పాల్వంచ రూరల్ : క్రీడల్లో తగు ప్రోత్సాహాన్ని అందిస్తామని, విద్యార్థులు ప్రతిభను చూపించి జిల్లా ఖ్యాతిని చాటాలని ఐటీడీఏ పాఠశాలల స్పోర్ట్స్ అధికారి కీసర రమేష్ అన్నారు. శుక్రవారం జోనల్ స్థాయి గిరిజన క్రీడా పోటీలు మోడల్ స్పోర్ట్స్ స్కూల్ కిన్నెరసానిలో జరిగాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడలపైనా దృష్టి పెట్టాలన్నారు. క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంచుతాయన్నారు. ఈ క్రీడలలో కిన్నెరసాని రేగళ్ల, తండా, సర్వారం, పాల్వంచ ఆశ్రమ పాఠశాలల బాలురు పాల్గొన్నారు. కబడ్డీ ఖోఖో, అథ్లెటిక్స్ క్యారమ్స్ చెస్ వాలీబాల్ పోటీల్లో 210 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీలు బాలసుబ్రహ్మణ్యం, నగేష్, నర్సయ్య, గోపాల్‌రావు, సైదులు, రాంబాబు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు 9మంది విద్యార్థుల ఎంపిక

బూర్గంపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని కృష్ణసాగర్ గ్రామంలో గల తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ దేవాదాసు తెలిపారు. వాలీబాల్ అండర్-19లో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్యామ్‌ప్రసాద్, హ్యాండ్‌బాల్-19లో హెచ్‌ఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి జనార్థన్, ఎంపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నవదీప్ ఎంపికయ్యారు. అలాగే హకీ అండర్-19కు బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కృష్ణప్రసాద్, ఎంపీసీ సెకండియర్ విద్యార్థులు తులసీరామ్, భరత్, బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పార్థివే, హీఈసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రామ్‌చరణ్ ఎంపికయ్యారు. అదే విధంగా టేబుల్ టెన్నిస్ అండర్-19కు బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి శేషంత్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఫారెస్టు అధికారులపై గొత్తికోయల దాడి



దాడిలో గాయాలను చూపుతున్న అటవీ శాఖాధికారులు

- సెక్షన్ ఆఫీసర్ గోవింద్, బీట్ ఆఫీసర్ కోటేష్‌కు స్వల్ప గాయాలు
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అధికారులు
- పోడు భూమిలో యంత్రంతో వరి కోసే విషయంలో ఘటన

కరకగూడెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖాధికారులపై వేట కొడవలితో గొత్తికోయలు దాడి చేసి గాయపరిచిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం వలస ఆదివాసీ గ్రామమైన అశ్వాపురం పాడులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అశ్వాపురంపాడు గొత్తికోయ గ్రామానికి చెందిన వజ్జం భీమరాజు పోడు సాగు చేస్తున్నా డు. ఆ పోడు భూమిలో వరి పంటను సాగు చేశాడు. పంట కోతకు రావడం తో.. శుక్రవారం కోత మిషన్‌తో తన పొలం కోయిస్తున్న క్రమంలో వెంకటాపురం బీట్ ఆఫీసర్ గమనించాడు. వెంటనే అక్కడికి వెళ్లి కోత మిషన్‌ను ఆపి వేశాడు. దీంతో ఎందుకు ఆపుతున్నావని రైతు భీమరాజు బీట్ ఆఫీసర్ తో వాగ్వాదానికి దిగాడు. బీట్ ఆఫీసర్ కోటేష్ మాట్లాడుతూ.. మీరు పంట సాగు చేస్తున్నారని, కానీ మిషన్లను ఉపయోగించవద్దని.. కోత మిషన్‌తో కోత కోయవద్దని వివరించాడు. ఇందుకు ఆగ్రహానికి గురైన భీమరాజు, అతని భార్య గంగమ్మ, కొడుకు అజయ్‌లు.. బీట్ ఆఫీసర్ కోటేష్‌పై దాడి చేశారు. భయాందోళనకు గురైన కోటేష్ అక్కడ నుంచి పారిపోయి కరకగూడెం పోలీస్ స్టేషన్‌కు వచ్చాడు. తనపై జరిగిన దాడి విషయం సెక్షన్ ఆఫీసర్ గోవింద్‌కు చెప్పడంతో.. సెక్షన్ ఆఫీసర్ ఘటనా స్థలికి వచ్చాడు. 'మీరు బీట్ ఆఫీసర్ ఎందుకు దాడి చేశారు.. దాడి చేయడం వల్ల మీపై కేసు నమోదు అయి జైలుకు వెళ్లాల్సి వస్తుంది' అని హెచ్చరించాడు. మరింత ఆగ్రహానికి భీమరాజు, అతని కుటుంబీకులు సెక్షన్ ఆఫీసర్‌పై కూడా వేట కొడవలితో దాడి చేయగా.. సెక్షన్ ఆఫీసర్ గోవింద్‌కు ఎడమ చేయి బొటన వేలుకు, ఎడమ చెవి పక్కన గాయాలయ్యాయి. ఈ విషయమై సెక్షన్ ఆఫీసర్ గోవింద్, బీట్ ఆఫీసర్ కోటేష్‌లు కరకగూడెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనపై కరకగూడెం ఎస్సై పీవీ ఎన్‌రావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సెక్షన్ ఆఫీసర్ గోవింద్, బీట్ ఆఫీసర్ కోటేష్‌ల ఫిర్యాదు వజ్జం భీమరాజు, భార్య గంగమ్మ, కొడుకు అజయ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేదరిక నిర్మూలనతో మెరుగైన జీవితం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్

కొత్తగూడెం లీగల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన ద్వారా మెరుగైన సమాజ స్థాపన జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ అన్నారు. శుక్రవారం పాల్వంచ మండలంలోని కుంటి నాగులగూడెంలో జరిగిన న్యాయ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. నిరుద్యోగం, చదువుకోవాల్సిన వయసులో పనికి వెళ్లడం వంటి ప్రధానమైన కారణాలు పేదరికాన్ని సూచిస్తాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు తగ్గించడం, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి సంక్షేమ పథకాలు అందించడం ద్వారా పేదరికం తగ్గించవచ్చునని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గ్రామాలలో బాల్య వివాహాలను నిషేధించాలని కోరారు. పేదరికాన్ని తగ్గించడం కోసం మహిళలు డ్వాక్రా గ్రూపులో చేరడం, స్వయం సహాయక ఉపాధి అవకాశాలను కల్పించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది తోట మల్లేశ్వరరావు, పాల్వంచ టౌన్ ఎస్సై జీవన్‌రాజ్, పారా లీగల్ వాలంటీర్స్ బాడీషా బిక్షమయ్య, ఎం. జానకిరామ్, కె. వీరభద్రం, ఆర్.పి. నాగమణి, గ్రామపెద్దలు దశరాజు, రమేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలి

అఖిలభారత ఐక్యరైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుమ్మడి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పత్తి, ధాన్యం, మొక్కజొన్న పంటలతో పాటు అన్ని రకాల పంటలను కొనుగోలు చేయడానికి మండల కేంద్రాల్లో విస్తృతంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. అనంతరం ధర్నాను ఉద్దేశించి అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయుకేఎస్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా కార్యదర్శి ముద్ద భిక్షం మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ధాన్యంతో పాటు పత్తి చేతికి అందుతున్న తరుణంలో ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు చెల్లించడంలో, ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో, ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో భాగంగా రెండు లక్షల రైతుల రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయకపోవడంతో పాటు సన్న ధాన్యానికి రూ. 500 పెండింగ్ బోనస్‌ను నేటికీ ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఒక వైపు ధాన్యం.. మరోవైపు పత్తి పంట చేతికొస్తుండడంతో అమ్ముకునేందుకు ప్రభుత్వం సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. బుర్ర వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపుడి రాము, ఉపాధ్యక్షులు కల్లూరి కిషోర్, సహాయ కార్యదర్శి భానోత్ ధర్మ, కోశాధికారి మాచర్ల సత్యం, తోటకూరి నరేష్, ఈసం శివ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాం

కాంగ్రెస్ బలోపేతం కోసమే సంఘటన్ సృజన్ అభియాన్

- ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాం

భద్రాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకే సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాం అన్నారు. భద్రాచలంలో శుక్రవారం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ.. అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐసీసీ సమావేశం తరువాత పార్టీని పటిష్ఠపరిచేందుకు జిల్లా కాంగ్రెస్ కమిటీలను బలపరచడం, బాధ్యతాయుతమైన, ప్రజలకు చేరువైన పార్టీ నిర్మాణాన్ని సృష్టించడం జరిగిందన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల ఎంపిక, నియామకం, అధికారాలు, బాధ్యతలలో సంస్కరణల ద్వారా సమర్థమైన నాయకత్వంవైపు అడుగులు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య, పీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, దుర్గాప్రసాద్, మండల అధ్యక్షులు పరిమి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ ప్రభుత్వమే

డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నది బీజేపీ ప్రభుత్వమేనని, బీసీ బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా డీసీసీ అధ్యక్షులు పొదెం వీరయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బంద్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కకుండా అడ్డుకున్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షంగా రాష్ట్రపతిని, ప్రధానమంత్రిని కలిసి ఈ అంశంపై విజ్ఞప్తి చేసేందుకు పదే పదే లిఖితపూర్వకంగా అభ్యర్థించినా.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు.

కొత్తగూడెం డిపోను సందర్శించిన ఆర్టీసీ ఈడీ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఆర్టీసీ డిపోకు కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పి.సోలోమాన్ శుక్రవారం సందర్శించారు. డిపోను గ్యారేజీ, ట్రాఫిక్ సెక్షన్లను తనిఖీ చేశారు. ప్రతీ సెక్షన్‌ను తనిఖీ చేసి అధికారులకు, సిబ్బందికి సలహాలు సూచనలు చేశారు. అనంతరం డిపో కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో సమావేశం నిర్వహించి.. అభివృద్ధి డిపోలో నెలకొన్న సమస్యలు, నడిపిస్తున్న సర్వీసులు ఆదాయం తదితర అంశాలపై చర్చించారు. ఈడితో పాటు ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎ.సరిరామ్, డిప్యూటీ ఆర్‌ఎం మల్లయ్య, పర్సనల్ ఆఫీసర్ సంపత్, కొత్తగూడెం డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మీ, మెడికల్ ఆఫీసర్ కె.శరత్ చంద్ర, ట్రాఫిక్, గ్యారేజీ, పోలీస్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

22న 'తిరునక్షత్రోత్సవ' కార్యక్రమాలు

భద్రాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చినజీయర్‌స్వామి తిరునక్షత్రోత్సవం సందర్భంగా ఈ నెల 22వ తేదీన భద్రాచలంలోని జీయర్‌మఠం, వికాస తరంగిణి, భగవత్ రామానుజ సేవా సమితి సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జీయర్‌మఠం అధ్యక్షులు గట్టు వెంకటాచార్య, ముఖ్య సమన్వయకర్త చారుగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం భగవత్ రామానుజల విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు, జీయర్‌స్వామి చిత్రపటంతో ఊరేగింపు ఉంటాయి.

ఆగిన తల్లిగుండె..

అనారోగ్యంతో కుమారుడి ఆత్మహత్య

అంత్యక్రియల అనంతరం కుప్పకూలి కన్నుమూసిన తల్లి

ఖమ్మం నగరం రామన్నపేటలో విషాదం



రంగమ్మ మృతదేహం, నాగచారి (ఫైల్)

ఖమ్మం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో బలవన్మరణానికి పాల్పడిన కుమారుడి అంత్యక్రియలు పూర్తిచేసిన కాసేపటికే తల్లి గుండె కూడా ఆగింది. దీంతో ఆ ఇంట తీవ్ర విషాదం అలముకుంది. ఖమ్మం నగరంలోని రామన్నపేటలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. రామన్నపేటకు చెందిన మునిగంటి రంగమ్మ (75) భర్త చాలా ఏళ్ల క్రితం మృతిచెందగా.. అవివాహితుడైన కుమారుడు నాగచారి(45)తో కలిసి ఉంటోంది. గతంలో నాగచారి ఆర్‌ఎంపీగా పనిచేశాడని, అనారోగ్యంతో బాధపడుతూ కొంతకాలంగాఖాళీగానే ఉంటున్నాడని తెలిసింది. ఈ క్రమంలో అనారోగ్య సమస్యలు మరింత ఎక్కువవడంతో మనోవేదనకు గురైన నాగచారి గురువారం మధ్యాహ్నం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత నాగచారి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం పోలీసులు శుక్రవారం రంగమ్మ, బంధువులకు అప్పగించగా.. సాయంత్రం అంత్యక్రియలు పూర్తిచేశారు. అయితే గురువారం మధ్యాహ్నం తన కుమారుడు మృతిచెందినప్పటి నుంచి రోదిస్తూనే ఉన్న రంగమ్మ.. శుక్రవారం తన కుమారుడి అంత్యక్రియలు పూర్తి చేసిన అనంతరం ఇంట్లోనే కుప్పకూలింది. బంధువులు పరీక్షించగా.. అప్పటికే ఆమె మృతి చెందింది. కుమారుడు చనిపోయిన మనోవేదనలో ఉన్న ఆ తల్లి గుండె ఆగిన ఘటనతో బంధువులు, స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

అసైన్డ్ భూమిని అమ్మిన వ్యక్తులపై కేసు నమోదు

ఖమ్మం క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అసైన్డ్ భూమిని ప్లాట్‌గా మార్చి అమ్మిన వ్యక్తులపై ఖానాపురం హవేలీ పోలీస్‌స్టేషన్ నందు శుక్రవారం రాత్రి కేసు నమోదు అయ్యింది. నగరానికి చెందిన వెంకటేశ్వర్లు అను వ్యక్తి దంసలాపురం రెవున్యూలోని 408 సర్వే నెంబరు గల అసైన్డ్ భూముల్లో దాకురి కోటేశ్వరి అను మహిళ కు విక్రయించి రూ. 5లక్షలు తీసుకున్నాడు. అదేవిధంగా అదే సర్వే నెంబరులో లక్ష్మయ్య లను వ్యక్తి ముస్తాఫనగర్‌కు చెందిన మహ్మద్ అఫ్జల్‌కి 121గజాలు అమ్మి రూ.3లక్షలు తీసుకున్నాడు. దీంతో ఇద్దరి బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

పోషకాహారంతోనే కంటి చూపును కాపాడుకోగలం

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతోనే కంటి చూపును కాపాడుకోగలమని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ నందు అధికారులకు, సిబ్బందికి ఉచిత కంటి పరీక్షల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించగా ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏఆర్‌డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో శరత్ మాక్సివిజన్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో పోలీస్ అధికారులు, సిబ్బంది కొరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి మనిషికి శరీరంలోని అన్ని అవయవాల్లో కళ్ళు చాలా ప్రధానమైనవన్నారు. ప్రస్తుతం మొబైల్ ఫోన్ వినియోగం ఎక్కువ కావడం ద్వారా మన కంటి చూపులో సమస్యలు త్వరగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ కంటి చూపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనంత తక్కువగా మొబైల్ ఫోన్ వాడుతూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కంటి చూపును ఎప్పటికప్పుడు సరిగ్గా కాపాడుకోగలిగితేనే మన దైనందిన కార్యక్రమాలను సరిగ్గా చేసుకోగలమని తెలిపారు. పోలీసు కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 150 మందికి పైగా కంటి పరీక్షలు (స్క్రీనింగ్, డిస్టెన్స్ విజిబిలిటీ టెస్ట్) చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీతో పాటు ఆర్‌ఐలు సుధాకర్, నరసింహారావు, కృష్ణారావు, లాల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ బిల్లును బీజేపీ అడ్డుకుంటోంది

నేటి బంద్‌లో అందరూ పాలుపంచుకోవాలి

విలేకరుల సమావేశంలో డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా కేంద్రంలోని బీజేపీ అడ్డుకుంటోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. బీజేపీ వ్యవహరిస్తున్న ఈ వైఖరిపై కాంగ్రెస్ పక్షాన దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. శుక్రవారం ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు విషయంలో బీజేపీ వ్యవహరించిన తీరుతో బీసీలు ఇబ్బందులు పడుతున్నారని, పార్లమెంట్‌లో బిల్లు చేయాలని కోరేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తాము ప్రధాని, రాష్ట్రపతిని కలిసేందుకు ఢిల్లీవెళితే అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. దాంతో ఢిల్లీలో ధర్నా కూడా చేశామని, ఇప్పటికైనా బీజేపీ తెలంగాణ నాయకులు 42శాతం రిజర్వేషన్ బిల్లు అమలుకోసం కృషి చేయాలని, ప్రధాని మోదీని కలిసేందుకు ఢిల్లీ తీసుకెళ్తే తాము వచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలప్పుడు తాము ఇచ్చిన బీసీలకు 42శాతం రిజర్వేషన్ల హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రక్రియ చేపట్టామని, శాస్త్రీయ గణాంకాలతో అమలుచేసేందుకు దేశంలో తొలిసారిగా సర్వే నిర్వహించామన్నారు. హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో బీసీ రిజర్వేషన్ బిల్లుపై అనుభవం కలిగిన అభిషేక్ సింగ్వి, రవివర్మ లాంటి న్యాయవాదులను ప్రభుత్వం నియమించి కొట్లాడిందన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లు విషయంలో బీజేపీ వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న బీసీ బంద్‌లో అందరూ పాల్గొనాలని విజ్ఞప్తిచేశారు. ఈ విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నూతి సత్యనారాయణ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రానిదే అగ్రస్థానం

(5వ పేజీ తరువాయి)



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మొక్కలను రైతులకు అందజేసే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 15లక్షల మొక్కలను పెంచబోతున్నామని, అవసరాన్ని బట్టి దాని సంఖ్యను పెంచుతామని ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీలు మరో రెండు సంవత్సరాల వరకు వచ్చే పంట క్రషింగ్‌కు సరిపోతాయని, ఈ లోపు కల్లూరుగూడెం ఫ్యాక్టరీ పూర్తుచేసుకోనున్నామన్నారు. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో 11 జిల్లాల్లో 11 ఫ్యాక్టరీలు నిర్మించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. ఆయిల్‌పామ్ రైతులకు మెగ్నీషియం, బోరాన్, ఇతర ఎరువులు, ఆధునిక పరికరాలు రైతులకు అందిస్తామన్నారు. అశ్వారావుపేటలో ఉద్యాన కళాశాలను మంజూరు చేస్తామని ప్రకటించారు. పామాయిల్‌కు టన్నుకి రూ.25వేలకు పైగా ధర పలికేలా కృషి చేస్తామన్నారు. జిల్లాలోని అప్పారావుపేట ఫ్యాక్టరీలో వచ్చే ఓఈఆర్ దేశంలోని పామాయిల్ ధర నిర్ణయంలో కీలకం కానుందన్నారు. నర్సరీల నుంచి ఒక్క కల్లింగ్ మొక్కకూడా బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీజిల్‌లో ఇథనాల్, ఔషధాలు, సబ్బుల తయారీలో పామాయిల్ ఉపయోగపడుతుందన్నారు. ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయిల్ ఫెడ్ ద్వారా రైతులకు రాయితీలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఆధునాతన పద్ధతిలో విత్తనాలు నాటే కార్యక్రమం ప్రారంభించడం ఇదో పెద్ద విప్లవాత్మకమన్నారు. అనంతరం అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి మాట్లాడుతూ పామాయిల్‌తో ఈ ప్రాంత రైతుల ఆర్థిక అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుందని, ఇదే లక్ష్యంతో మంత్రి తుమ్మల పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ శంకరయ్య, జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఫ్యాక్టరీస్ మేనేజర్ శ్రీకాంత్, పామాయిల్ రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ వాసం రాణి, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీల మేనేజర్ నాగబాబు, కళ్యాణ్, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్

ఖమ్మం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏఐసీసీ పరిశీలకుడు మహేంద్రన్ ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి, ఎంపిక నిమిత్తం వచ్చిన మహీధరన్ జిల్లాల రాజకీయ పరిస్థితులపై చర్చించారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మెజారిటీలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీకి గౌరవప్రదమైన చరిత్ర ఉందని, కొత్త, పాత నాయకులతో పార్టీని బలోపేతం చేసేలా డీసీసీ అధ్యక్షుల ఎంపిక జరగాలని భట్టి సూచించారు.

గర్భవతి చేసి పెళ్లికి నిరాకరించిన యువకుడు

ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఆళ్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) ప్రేమించి పెళ్లిచేసుకుంటానని నమ్మించిన యువకుడు ఓ యువతిని గర్భవతి చేసి చివరకు పెళ్లికి నిరాకరించాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. టేకులపల్లి సీఐ బత్తుల సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం సంగ్యాతండాకు చెందిన గుగులోత్ రాంబాబు, భద్రాద్రికొత్తగూడెం జిల్లా, ఆళ్లపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలైన గిరిజన యువతితో 2020లో ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఏర్పడింది. వారి పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో రాంబాబు యువతికి మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఒక రోజు యువతి ఇంట్లో శారీరకంగా కలిశారు. ఈ క్రమంలో 2021లో ఆ యువతి మూడు నెలల గర్భవతి అని తెలియడంతో, రాంబాబు అబార్షన్ చేయించాడు. కాగా 2024వరకు పెళ్లి చేసుకుంటానని నమ్మిస్తూ, ప్రేమ పేరుతో ఉద్యోగ రీత్యా అంటూ తనవద్ద రూ.5లక్షలు తీసుకున్నాడు. ఈ నేపథ్యంలోనే మరోసారి యువకుడు దుబాయ్ వెళ్లి వచ్చాక పెళ్లిచేసుకుంటానని, పొంతనలేని విషయాలు చెప్పడంతో అతడి మాటల్లో మోసంతో పాటు మరో యువతిని ప్రేమిస్తున్నాడని తెలుసుకున్న యువతి రాంబాబును నిలదీసింది. దీంతో పాటు అతనితో పాటు, వారి కుటుంబ సభ్యులు తనపై ఘర్షకు దిగి దాడిచేసి ఇబ్బందులకు గురిచేశారని, జరిగిన మోసంపై యువతి కుటుంబ సభ్యులకు తెలపడంతో మూడు నెలల క్రితం గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ చేశారు. అయినా రాంబాబు పద్ధతి మార్చుకోలేదు. తనలో మార్పువస్తుందని ఆలోచించిన దివ్యాంగురాలైన ఆ యువతి చివరకు తనను ప్రేమ పేరుతో, శారీరకంగా, ఆర్థికంగా వాడుకొని మోసం చేశాడని, గురువారం గుగులోత్ రాంబాబుపై ఫిర్యాదు చేయడం, శుక్రవారం సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టి ఆళ్లపల్లి పోలీస్‌సేష్టన్‌లో కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు రావొద్దు

(5వ పేజీ తరువాయి)

అందించేందుకు ఇందిర సౌర జలవికాసం కింద ప్రతిపాదనలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సెస్పీ లాంటి కాలువలు, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల వద్ద సోలార్ విద్యుత్ ప్యానళ్లను ఏర్పాటుచేసేలా, దేవాదాయశాఖ భూముల్లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆసక్తి ఉన్న రైతులను తమ భూముల్లో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఐదు యంగ్‌ఇండియా సమీకృతగురుకులాలను మంజూరు చేశామని ప్రతీ పాఠశాల ఒక గ్రామంగా ఉండబోతుందని, వీటిని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వరదలు, వర్షాల సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విద్యుత్ సిబ్బంది పనిచేస్తున్నారని, రికార్డు సమయంలో విద్యుత్ పునరుద్ధరణ చేస్తున్నారని, కొందరి నిర్లక్ష్యంతో అందరికీ చెడ్డపేరు వస్తోందని, ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, డైరెక్టర్లు మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, మధుసూధన్, ప్రభాకర్, సీతలు మదన్‌లాల్, తిరుమలరావు, రాజుచౌహాన్, చరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

భక్తికి మార్గం.. కార్తీక మాసం

22 నుంచి కార్తీక మాసం ప్రారంభం
21న కార్తీక దీపంతో ప్రారంభమై
నవంబరు 21తో పూర్తి
శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు


విద్యుత్ దీపాలతో అలంకరించిన ఖమ్మం గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో కార్తీక మాసంకు సంభందించి వివిధ ఆలయాల్లో, ప్రముకంగా శివాలయాలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22నుంచి కార్తీకమాసం ప్రారంభం కావటంతో భక్తులు అయ్యప్ప మాలలు ధరించడానికి వేల సంఖ్యలో ముందుగానే ఆలయాలలో అనుమతులు తీసుకున్నారు. శివుడికి ఎంతో ప్రీతిపరమైన మాసం కావడంతో శివాలయాలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తుంటారు. కార్తీకమాసంలో చేసే ఆరాధన పాపం నుంచి విముక్తులను చేయడంతో పాటు భక్తిమార్గంలో నడిపిస్తుందని భక్తుల నమ్మకం. ఈనెల 22 నుంచి నవంబరు 21 వరకు నెల రోజుల పాటు కార్తీకమాసం జరిగే వేడుకలుకు, పూజలకు సంబంధించి శివాలయాలు ముస్తాబయ్యాయి. కార్తీకమాసంలో ఆలయాలను రంగులతో ముస్తాబుచేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్తీక మాసానికి సమానమైన మాసమేదీ లేదని పండితులు చెబుతున్నారు. ఈ మాసంలో ఆలయాలు, తులసి కోట్లలో దీపాలు వెలిగించడం ఆనవాయితీ. ఆధ్యాత్మికంగానే కాదు ఆరోగ్యప్రదమైన మాసంగా చెబుతారు. ఈమాసంలో ప్రతీ సోమవారం ఉపవాసదీక్ష చేస్తారు. హరిహర దాసులకు ప్రీతిపాత్రమైన కార్తీకంలో భక్తులు కఠినంగా చేపట్టే నోములకు ప్రాధాన్యత ఉంది. ఉపవాసం, స్నానం, దానం వంటి వాటి గురించి పండితులు చెబుతున్నారు. కాగా, శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేయగా, ఖమ్మంలోని శ్రీగుంటు మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రమే ఆకాశదీపం వెలిగించనున్నారు. కార్తీకమాసంలో ఒక్కోరోజు ఒక్కొక్క విశేషం ఉంది.

ఈ నెల మొత్తం పర్వదినాలే. భక్తులు ప్రతిరోజు ఉపవాసం ఉంటూ సాయంత్రం నక్షత్ర దర్శనం అయ్యాక విరమిస్తారు. అక్టోబరు 10న తేదీన నాగుల చవి తితో పాటు ప్రతి సోమవారం ఆలయాలు భక్తులుతో కిటకిటలాడుతాయి. గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 22న గణపతి పూజ, హోమం, 25న నాగులచవితి సందర్భంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, 27న మొదటి సోమవారం కావడంతో లఘు అభిషేకాలు సుబ్రహ్మణ్యస్వామి శాంతి కళ్యాణం, నవంబరు 1న ప్రత్యేక అభిషేకాలు, 2న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 10న మహా పుష్పాభిషేకం, 18న స్వామివారి శాంతి కళ్యాణం, 19న గ్రామోత్సవం (ఊరేగింపు), 21న సామూహిక కుంకుమ పూజలు, 21న మహా అన్నదానంతో కార్తీకమాస పూజలు పూర్తికానున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో కోటేశ్వరరావు తెలిపారు.

ఖమ్మంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.220 కోట్లు మంజూరు

ప్రతీ ఇంటికి తాగునీరు సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
ముస్తఫానగర్‌లో బీసీ వసతి గృహ పనులకు తుమ్మల శంకుస్థాపన


హాస్టల్ భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, అక్టోబరు17(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మంనగరంలో తాగునీటి సరఫరారే రూ.220 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, ప్రతీ ఇంటికి పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ముస్తఫానగర్‌లో బీసీ సంక్షేమ హాస్టల్ రూ.9కోట్లతో నిర్మించే నూతన భవనాలకు మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మట్లాడుతూ హాస్టల్ భవనాలను నాణ్యతతో చేపట్టాలని, పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కలిపించాలని ఆదేశించారు. ఖమ్మం నగరంలో ప్రధాన సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కారం చేయడం జరుగుతుందని, రాబోయే వేసవిలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకూడదని అందరికీ తాగునీరు అందాలన్నారు. కష్టపడి సంపాదించిన డబ్బులు పిల్లల భవిష్యత్‌కు ఖర్చుపెట్టాలి తప్పా అనవసర ఖర్చులు పెట్టవద్దన్నారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులం స్వామి నారాయణ స్కూల్ త్వరలో నిర్మాణం కాబోతున్నాయని తెలిపారు. పేద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గురుకులాల్లో డైట్‌చార్జీలను సీఎం రేవంత్‌రెడ్డి 40శాతం పెంచారని తెలిపారు. కాస్మోటిక్ చార్జీలను 200శాతం పెంచారని తెలిపారు. నగరంలో రోడ్లవెడల్పు పనులకు ప్రజలు సహకరించాలని, జరిగిన నష్టానికి పరిహారం అందిస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు వెడల్పు పనులు వేగంగా పూర్తిచేయాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతో జిల్లా పరిధిలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టే అవకాశం లభించిందని, భవిష్యత్తులో కూడా ఖమ్మం, జిల్లా అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. రాష్ట్ర గిడ్డంగులు సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావను, నగర మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహార, ఏఎంసీ ఛైర్మన్ యార్లగడ్డ హనుమంతరావు, కార్పొరేటర్ రోజ్‌లీనా, బీసీ సంక్షేమాధికారి జ్యోతి, ఆర్డీవో నర్సింహారావు, ఈఈ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ ముఫ్ట్‌బిజిలీ పథకాన్ని ఉపయోగించుకోవాలి


పథకంపై అవగాహన కల్పిస్తున్న ఎన్‌పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి

ఖమ్మం అర్బన్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌పీడీసీఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహస్తులు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చన్నారు. అధికారులు రాయితీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, టీజీ రెడ్కో జిల్లా మేనేజర్ పి.అజయ్‌కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపికలు

ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీలు నరేష్‌కుమార్, రామారావు

చుంచుపల్లి, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపికలు ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల నందు ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నామని ఎస్‌జీఎఫ్ రెండు జిల్లాల సెక్రెటరీలు నరేష్‌కుమార్, రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, 19 విభాగాల్లో ఉమ్మడి జిల్లా బాల, బాలికల రైఫిల్ షూటింగ్ జట్లు ఎంపికలు ఇరు జిల్లాల విద్యాశాఖ అధికారులు పి.శ్రీజ, బి.నాగలక్ష్మీ ఆదేశాలనుసారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్నటువంటి వ్యాయామ ఉపాధ్యాయులు, వ్యాయామ దర్శకులు అందరు తెలియజేసిన నిబంధనలను పాటిస్తూ క్రీడాకారులతో సకాలంలో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7842266833, 9951274678 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఆదివాసీల బీటీపీఎస్ ముట్టడి ఉద్రిక్తత

ఉద్యోగులను బయటకు రానివ్వని ఆందోళనకారులు
ఇబ్బంది పడ్డ బీటీపీఎస్ సిబ్బంది


సీఈకి వినతిపత్రాన్ని అందిస్తున్న ఆదివాసీ నాయకులు


గేట్ వద్ద అత్యుత్సాహం చూపుతున్న సెక్యూరిటీ సిబ్బంది

మణుగూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం బీటీపీఎస్ గేట్ ఎదుట జరిగిన ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ప్లాంట్ నిర్మాణ సమయంలో ఆదివాసీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి తీవ్ర అన్యాయం చేశారని ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం గిరిజన సంఘాల నేతలు పెద్దఎత్తున బీటీపీఎస్ గేట్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. గిరిజన సంఘ నేతలు కొంతమంది సీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విధుల్లో ఉన్న కార్మికులను, ఉద్యోగస్తులను బయటికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో ప్రధాన గేట్‌వద్ద సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడ్డారు. ప్లాంట్ నిర్మాణ సమయంలో ఆదివాసీలకు చెందిన 375 మంది రైతుల భూములను ప్లాంట్ కు ధారాదత్తం చేయగా కేవలం 73మంది మాత్రమే ఉద్యోగాలు ఇచ్చి, మిగతా ఉద్యోగాలను అధికార యంత్రాంగం గిరిజనేతరులకు అమ్ముకుందని నేతలు ఆరోపించారు. అర్హులైన గిరిజనులందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించి, ఆర్ అండ్ ఆర్ నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఈ బిచ్చన్నకు అందజేశారు. కాగా ఈ మేరకు సంస్థ సెక్యూరిటీ సిబ్బంది విలేకరులను ఆందోళన కారుల వద్దకు వెళ్లనీయకుండా అత్యుత్సాహం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు పాయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ దొర, ఆలెం కోటి, కొమరం రామ్మూర్తి, చిడెం నాగేశ్వరరావు, కొమరం శ్రీను, కలేటి వీరయ్య, మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థపరుడు 'కర్నాటి'..

కృష్ణయ్య ఆశయ సాధనకు ప్రతీ కార్యకర్త కృషిచేయాలి
ఉద్యమాలకు ఆద్యుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు...
వర్ధంతి సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని


కృష్ణయ్య వర్ధంతి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

నేలకొండపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నిస్వార్థ కమ్యూనిస్టు నాయకుడు కర్నాటి కృష్ణయ్య అంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కొనియాడారు. శుక్రవారం నేలకొండపల్లిలోని కర్నాటి కృష్ణయ్య భవన్‌లో జరిగిన కృష్ణయ్య 27వ వర్ధంతి సభలో కూనంనేని ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కృష్ణయ్య కుమారుడు,సీపీఐ జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో కృష్ణయ్య పోషించిన పాత్ర మరువలేనిదన్నారు. ఖమ్మం ద్విసభ్య నియోజకవర్గం నుంచి తొలి శాసనసభ్యునిగా గెలిచి, ప్రజా ప్రతినిధిగా ప్రజలకు సేవ చేసిన నాయకుడు కృష్ణయ్య అన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా, కర్నాటి భానుప్రసాద్‌లు సభలో మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వర్లు, సీపీఎం మండల కార్యదర్శి కేవీరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఉన్నం బ్రహ్మయ్య, డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్‌కు జీవితఖైదు

2023లో తల్లీకొడుకుల హత్య
నారాయణపురంలో కలకలం రేపిన జంటహత్యలు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటుపడిన ఓ ఆటోడ్రైవర్ తల్లీకొడుకులను హత్యచేసిన సంఘటనలో రెండేళ్ల తర్వాత శిక్షపడింది. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తూ 6వ అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాసరావు శుక్రవారం సత్తుపల్లిలో సంచలన తీర్పునిచ్చారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ దర్శనపు సునీల్ అలియాస్ మహేష్ జల్సాల కోసం అక్రమ సంపాదనకు అలవాటుపడ్డాడు. ఈ క్రమంలో 2023 జులై 31న అదే గ్రామానికి చెందిన రాయల తులసమ్మ ఫించన్ డబ్బుల కోసం సత్తుపల్లి పాతసెంటర్‌లోని ఓ బ్యాంక్‌కు చేరుకుంది. స్వగ్రామం వెళ్లేందుకు మహేష్‌తో రూ.100కు కిరాయి మాట్లాడుకుని కిరాణా సరుకులు తీసుకుంటున్న క్రమంలో రూ.500నోట్ల కట్టలు కనిపించాయి. ఆ డబ్బును ఎలాగోలా కాజేసేందుకు పన్నాగం పన్నిన మహేష్ తనను గుర్తుపట్టే అవకాశం ఉండటంతో ఆమెను వేరే ఆటోలో వెళ్లమని సముదాయించాడు. అదే రోజు రాత్రి డబ్బులు కాజేసేందుకు తులసమ్మ ఇంటికి గడ్డికోసే కొడవలిని వెంట తీసుకుని బయల్దేరాడు. నిద్రిస్తున్న తులసమ్మను, మతిస్థిమితం లేని ఆమె కుమారుడు సత్యనారాయణలను అమానుషంగా కొడవలితో గొంతుకోసి హత్యచేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మరుచటి రోజు సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని అరెస్ట్‌చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయగా సాక్ష్యాధారాలు, ఇరుపక్షాల వాదనలు పరిశీలించిన న్యాయాధికారి పైవిధంగా తీర్పుఇచ్చారు. కాగా ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్‌కే.అబ్దుల్‌బాషా, సీఐలు జే.మోహన్‌బాబు, టి.శ్రీహరి, సీడీవె వి.నరేష్, కోర్టులైజన్ ఎస్‌ఐ కె.శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుళ్లు డి.నాగేశ్వరరావు, కే.శ్రీనివాస్‌లను సీపీ సునీల్‌దత్ అభినందించారు.

ఆత్మహత్య కేసులో 8మందికి జైలుశిక్ష

అశ్వాపురం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన గూడూరు మల్లారెడ్డి అనే వ్యక్తి ఆత్మహత్య కేసుకు సంబంధించి అదేగ్రామానికి చెందిన ఎనిమిది మందికి ఏడు ఏళ్ల జైలుశిక్ష పడింది. ఈమేరకు శుక్రవారం కొత్తగూడెం లీగల్, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జి జస్టిస్ కె.కిరణ్‌కమార్ తీర్పు చెప్పారు. కేసు పూర్వాపరాలిలా ఉన్నాయి. మొండికుంట గ్రామానికి చెందిన గూడూరు మల్లారెడ్డి తనకు వారసత్వంగా ఉన్న రెండు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన మేడవరపు మంగపతిరావు, మేడవరపు సుధీర్, మేడవరపు సురేష్, పర్వత నరేష్, తుక్కాని రామిరెడ్డి, కాసరబాద సత్యం, కాసరబాద రాములు, కాసరబాద సందీప్, గూడూరు జనార్ధన్‌రెడ్డిలు ఆక్రమించుకున్నారని, పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ జరిగింది. కానీ వారు మాట వినకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవ్వరూ పట్టించుకోవటంలేదని, నువ్వుచనిపో లేకపోతే మేము చంపేస్తాము అంటూ ఆక్రమదారులు బెదిరించారు. అప్పటినుంచి మనోవ్యథకు గురైన మల్లారెడ్డి తనకు న్యాయం జరుగదని భావించి చనిపోవాలని నిర్ణయించుకుని 2021 మార్చి 3న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈమేరకు జరిగిన సంఘటనపై అదే రోజు మల్లారెడ్డి చిన్న కుమారుడు శ్రీనివాసరెడ్డి అశ్వాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజు కేసునమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో 12 మంది సాక్షులను విచారించారు. ఈ కేసు విచారణలో ఉన్న కాలంలో కాసరబాద సత్యం అనారోగ్యంతో మృతి చెందాడు. విచారణ అనంతరం పైన పేర్కొన్న వ్యక్తులపై నేరం రుజువు కాగా ఎనిమిది మందికి ఏడు ఏళ్ల కఠిన కారాగార శిక్ష, మనిషికొక్కంటికీ రూ.5 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారం రాజారావు నిర్వహించగా కోర్టు నోడల్ అధికారి డి.రాఘవయ్య, లైజాన్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, డ్యూటీ ఆఫీసర్ ఈశ్వర్‌రావులు సహకరించారు.

వ్యక్తికి జైలుశిక్ష ఖరారు

భద్రాచలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన చల్లా ఏడుకొండలుకి ఏడాది జైలుశిక్ష, రూ.1000 జరిమాన విధిస్తూ భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి జస్టిస్ శివనాయక్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2017 జులై 18న ఏడుకొండలు బడ్డీకొట్టు వద్ద విద్యుత్తు సరఫరా విషయంలో నిర్లక్ష్యం వలన విద్యుత్తు షాక్‌కు గురై గండికోట ముత్యాలు, ఆమె కుమారుడు యేసురాజుకు విద్యుదాఘాతానికి గురి కాగా.. యేసురాజు మృతి చెందాడు. దీంతో ఏడుకొండలపై అప్పటి బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా శుక్రవారం తీర్పు వెల్లడించారు.

భారీ టేకు దుంగల పట్టివేత

తెల్లవారుజామున దాడిచేసి పట్టుకున్న సెక్షన్ అధికారి రాజేష్
ఒక్కో చెట్టు వయస్సు 50ఏళ్ల పైనే..


పట్టుబడిన కలప దుంగలు

చర్ల, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) భద్రాద్రికొత్తగూడెం జిల్లా చర్ల మండలం సుబ్బంపేట గ్రామ శివారులో ట్రాక్టర్‌పై తరలిస్తున్న 11 టేకు దుంగలను శుక్రవారం తెల్లవారుజములను వద్దిపేట సెక్షన్ అధికారి ఇందుర్తి రాజేష్, బీట్ అధికారి బాలాజీ దాడిచేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.రెండు లక్షలు ఉన్నట్లు చర్ల అటవీశాఖ అధికారులు తెలిపారు. చర్ల మండలం సరిహద్దున్న బీజాపూర్ జిల్లా మజ్జూరు కొత్తపల్లి అడవుల నుంచి అక్రమంగా టేకు దుంగలను తరలిస్తున్నట్లు చర్ల అటవీశాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో వద్దిపేట సెక్షన్ అధికారి రాజేష్, బీట్ అధికారి బాలాజీ, ఇతర సిబ్బంది వద్ది పేట అడవుల్లో నిఘా పెట్టారు. శుక్రవారం తెల్లవారు జామును టేకు కలపను సమానంగా కోసి ట్రాక్టర్ ఇంజన్‌పై ముందు వెనుక కట్టి సుబ్బంపేట గోదావరి పెర్రీపాయింట్‌కు తరలిస్తున్నారు. దీంతో అప్పటికే మాటు వేసిన అధికారులు దాడి చేసి 11 భారీ టేకు దుంగలు పట్టుకున్నారు. కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ని సీజ్ చేసి చర్ల రేంజ్ కార్యాలయనికి తరలించారు. పట్టుబడిన కలప మొద్దులు భారీ ఆకారంలో ఉన్నాయి. ఒక్కో చెట్టు వయస్సు 50 యేండ్లు పైనే ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు. కాగా గత కొంత కాలంగా చర్ల, వెంకటాపురం, చత్తీస్‌గడ్ సరిహద్దునుంచి భారీగా కలప అక్రమ రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది.

అటవీ ప్లాంటేషన్‌లో జామాయిల్ మొక్కల నరికివేత


కలపను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

జూలూరుపాడు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జూలూరుపాడు అటవీ రేంజ్ పరిధిలోని గుండెపుడి బీట్‌లో అటవీ ప్రాంతంలోకి మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రవేశించి ప్లాంటేషన్‌లో సాగు చేసిన జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి తరలించినట్లు గుండెపుడి డీఆర్‌ఓ నాసుర్బీ తెలిపారు. శనివారం ఆమె తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గుండెపుడి అటవీ ప్రాంతంలో ఈ నెల 15వ తేదీన జామాయిల్ మొక్కలను నరికి ట్రాక్టర్‌పై సదరు వ్యక్తి తరలించారు. దీంతో కొంతమంది గ్రామస్తులు శుక్రవారం సాయంత్రం సమాచారం అందించారు. అటవీ ప్రాంతంలోకి వెళ్లి పరిశీలించగా 84 చెట్లను నరికినట్లు తేలిందని, వాటిని అనంతారంలోని ఓ రైతు పొలంలో నిల్వచేయగా కలపను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ నిర్వహించగా అనంతారం గ్రామానికి చెందిన ఈసం వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన సొంత అవసరాలకు ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాంటేషన్‌లో జామాయిల్ మొక్కలను నరికి వాటిని తరలించినట్లు ఒప్పుకున్నారని అన్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

గంజాయి, గుట్కాలపై ఉక్కుపాదం

ఇల్లెందులో పోలీసుల మూకుమ్మడి దాడులు
భారీగా గుట్కా ప్యాకెట్లు స్వాధీనం..
కొత్తగూడెం పట్టణంలో చైతన్యం తనిఖీలు ముమ్మరం
డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

ఇల్లెందు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలో శుక్రవారం సాయంత్రం పోలీసు బలగాలు డీఎస్పీ చంద్రబాను ఆధ్వర్యంలో వర్తక, వ్యాపార సంస్థల్లో పెద్దఎత్తున గుట్కా, గంజాయి, డ్రగ్స్ కోసం తనిఖీలు చేపట్టారు. గత కొద్ది రోజులుగా ఇల్లెందులో 'డ్రగ్స్‌పై యుద్ధం' పేరుతో ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్న ఇల్లెందు పోలీసులు పట్టణంలోని వివిధ కాలనీలు, బస్తీల్లో, మెయిన్ రోడ్లపై ఉన్న వ్యాపార సంస్థల్లో, పాన్‌షాపుల్లో తనిఖీలు నిర్వహించి వందలాది గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జగదాంబ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి డీఎస్పీ చంద్రబాను మాట్లాడుతూ యువకులు, విద్యార్థుల ప్రాణాలు హరిస్తున్న గంజాయి, గుట్కాలను రూపుమాపడానికి సహకరించాలని కోరారు. మైనర్లకు పాన్‌షాపుల్లో పాన్, సిగిరేట్ అమ్మగాలు జరిపితే షాపు యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుట్కాలు నమలడం వల్ల బావితరాలు అనారోగ్యాలకు గురవుతారన్నారు. మత్తుపదార్థాల వలన యువత క్యాన్సర్ కంటే భయంకరమైన వ్యాధుల భారీన పడుతున్నారని, తల్లిదండ్రులు అప్రమత్తంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఏకకాలంలో పట్టణంలో పోలీస్ బలగాలు నిర్వహించిన దాడుల్లో యాంటీ నార్కోటిక్ డాగ్‌స్కాడ్‌తో పాటు పోలీస్ సీఐ తాటిపాముల సురేష్, ఎస్సైలు సూర్య, హసీన తదితరులు పాల్గొన్నారు.


కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కిరాణ దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

గంజాయి రహిత సమాజం సాదిద్దాం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన చైతన్యం - డ్రగ్స్‌పై యుద్ధం అనే కార్యక్రమం కొత్తగూడెం డివిజన్‌లో విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని కొత్తగూడెం వన్‌టౌన్ ,టూటౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గంజాయి రహిత సమాజం సాదిద్దామనే లక్ష్యంతో ప్రతీ ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ కిరాణ షాపులు, పాన్ షాపులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, శివప్రసాద్, ప్రతాప్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆత్మహత్యాయత్నం

ఒకరి మృతి.. మరొకరికి ఆస్పత్రిలో చికిత్స

ఎర్రుపాలెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు స్నేహితుల్లో ఒకరు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మోలుగుమాడు గ్రామంలో ఆర్థిక సమస్యలతో రెండు రోజుల క్రితం షేక్ జానీసాహెబ్, ఆముదాల రాము ఇద్దరు మద్యంలో గడ్డిమందు కలిపి సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కాగా స్థానికులు గుర్తించి వారిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆముదాల రమేష్ అలియాస్ రాము(23) శుక్రవారం మృతిచెందాడు. చేతికి వచ్చిన కుమారుడు అండగా నిలబతాడనుకుంటే.. ఆత్మహత్య చేసుకుంటాడని అనుకోలేదని తల్లిదండ్రులు విలపించారు. ఈ ఘటనలో షేక్‌జానీ ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రాము సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

బిల్డింగ్‌పై నుంచి పడిన కస్తుర్బా విద్యార్థిని

మానసిక సమస్యలే కారణమని అనుమానం!

ఖమ్మం అర్బన్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కస్తుర్బా జూనియర్ బాలికల కళాశాలకు చెందిన ఓ విద్యార్థిని గురువారం కళాశాల భవనంలో రెండో అంతస్తు నుంచి పడడంతో తీవ్రంగా గాయపడిన విద్యార్థినిని కళాశాల సిబ్బంది ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో ఆస్పత్రి వద్దకు వచ్చిన విద్యార్థిని తల్లిదండ్రులు స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియలేదు. కానీ ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. ఖమ్మం జిల్లా రఘునాధపాలెం మండలం శివాయిగూడెంలోని కస్తుర్బా జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మానసిక సమస్యతో బాధపడుతుందని జీసీడీవో తులసి తెలిపారు. ఈ ఘటనకు ముందు రోజు తోటి విద్యార్థులతో బాధిత విద్యార్థిని తాను ఎవరో పిలుస్తున్నారని, తాను భవనం పైనుంచి దూకుతానంటూ చెప్పడంతో విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌కు తెలిపారు. దీంతో ఆ విద్యార్థినికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కానీ ఆ విద్యార్థిని గురువారం తెల్లవారుజామున కళాశాల భవనంలో మొదటి అంతస్తులో పడి ఆపస్మారక స్థితిలో ఉండడంతో ఆస్పత్రికి తీసుకు వెళ్లామన్నారు. అయితే ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్యకు ప్రయత్నించిందా అన్నది తెలియదన్నారు. కానీ బాధిత విద్యార్థిని ప్రైవేట్ ఆస్పత్రిలో కోలుకుంటుంది. ఇదిలా ఉండగా విద్యార్థిని తల్లిదండ్రులు కళాశాల సిబ్బంది తమ కుమార్తెకు సరైన వైద్యం చేయించలేదంటూ ఆరోపిస్తూ సోషల్ మీడయాలో పోస్టు చేశారు.

ఇసుక లారీ సీజ్

ఖమ్మంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని రూరల్ పోలీసులు శుక్రవారం సీజ్ చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, కోదాడకు చెందిన లారీ భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా చర్లలో ఇసుకను లోడ్ చేసుకుని కోదాడ వెళుతోంది. మార్గంమధ్యలో కరుణగిరి వద్ద లారీని ఆపి పోలీసులు తనిఖీ చేశారు. ఎలాంటి ఒకే పరిమిషన్‌పై ఎక్కువసార్లు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. లారీని సీజ్‌చేసి లారీ డ్రైవర్ కోటేశ్వరరావు, లారీ యజమాని రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

డొంకను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు, డొంకరహదారులు, కాల్వలపై నిర్మాణాలపై ఖమ్మం నగర పాలక సంస్థ, రెవెన్యూవిభాగం అధికారులు స్పందించారు. ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు కేఎంసీ పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిగ్గు తేల్చారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మతిలేని అనుమతి' కథనంపై కమిషనర్ స్పందించారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. దీంతో కేఎంసీ పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర ఆధ్వర్యంలో రెవెన్యూశాఖ సర్వేయర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పూర్వకాలంలో ఉన్న డొంకమ్యాప్‌లను పరిశీలించారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని పరిశీలన అధికారులు తెలిపారు.

ఏఎన్‌ఎంలపై పని ఒత్తిడి తప్పించాలి

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్య, కుటుంబసంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పనివత్తిడి తప్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లాప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలకు మొబైల్ అప్లికేషన్స్, ఎన్‌సీడీలను రద్దు చేసి పనిభారం తగ్గించాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వారిపై పనులభారం అధికంగా మోపారన్నారు. అన్ని పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో రిపోర్టులు ఇవ్వాలని,వత్తిడి చేస్తుండటంతో పద్నాలుగు రకాల మొబైల్ అప్లికేషన్ల ద్వారా పనులు చేయాల్సివస్తోందన్నారు. ఎన్‌సీడీ యాప్ రాత్రి 11 గంటల తరువాత ఓపెన్ అవుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.కార్యక్రమంలో ఏఎన్ఎంలు శ్రీలక్ష్మి, నాగమణి, సరస్వతి, రచ్చానీత, విజయశ్రీ, దివ్య, పాతిమ, సంధ్య పాల్గొన్నారు.

కళావిహీనం

రంగు వెలసి, విరిగిపోయిన విగ్రహాలు

నగరంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన విగ్రహాలు వెలవెలబోతున్నాయి. వీటి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా శిథిలమవుతున్నాయి.. ముస్తఫానగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం విగ్రహం రంగు వెలసి పోవటంతోపాటు, పక్కనే ఉన్న గుర్రం బొమ్మ తోక విరిగింది. మార్కెట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన చేపవిగ్రహం పూర్తిగా మాయం అయ్యింది. నయాబజార్ కాలేజ ఎదురుగా ఉన్న నెహ్రూ బొమ్మ రంగు వెలసిపోయింది, రింగ్ రోడ్‌లోని జింక బొమ్మలు రంగు వెలిశాయి.. ఇల్లెందురోడ్ సర్కిల్‌లో వాటర్‌ఫౌంటెయిన్ విరిగిపోయింది.

ఫొటోలు: ఆంధ్రజ్యోతి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్ ఖమ్మం



మిర్చి మార్కెట్ రోడ్డు సర్కిల్ మాయమైన చేప బొమ్మ, ధ్వంసమైన దిమ్మె



ముస్తాఫా నగర్ సెంటర్‌లో తోక విరిగిన గుర్రం బొమ్మ



ఇల్లెందురోడ్ సర్కిల్‌లో విరిగిన వాటర్‌ఫౌంటెయిన్





రంగులు వెలిసి కళావిహీనంగా మారిన నెహ్రూ, అబ్దుల్ కలాం విగ్రహాలు

మహిళా డిగ్రీ కళాశాలలో ఎకో బజార్ నిర్వహణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో శుక్రవారం ఎకో బజార్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ బానోతు రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ తమ నైపుణ్యాలతో తయారు చేసిన వంటలు, ఇతర సామగ్రి, అలంకరణ వస్తువులు 20 స్టాల్లల్లో ఏర్పాటు చేసి ప్రదర్శించారు. ఎకో బజార్లో పర్యావరణ స్నేహపూర్వక ఉత్పత్తులు సేవలు ప్రదర్శించినందుకు గాను విద్యార్థులను అధ్యాపకులను కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.

సన్మానం

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆరోగ్యశ్రీ డీఈవోఎస్‌గా రాష్ట్రఅధ్యక్షుడుగా ఎన్నికైన కల్లేపల్లి వినయ్‌బాస్కర్‌ను శుక్రవారం జిల్లా మాల మహానాడు తరఫున సన్మానించారు. 14 ఏళ్లుగా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ డీఈవోగా పని చేస్తూ అందరి మన్ననలు అందుకున్నారని కొనియాడారు. సంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముదుసు జాకబ్‌ప్రతాప్, పేరం మల్లయ్య, కొర్లపాటి చిరంజీవి, తాలారి రాధాకృష్ణ, కరాటేవేణు పాల్గొన్నారు.

'ఛాంబర్' ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎన్నికల అధికారి శ్రీరాములు

ఖమ్మంమార్కెట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): 'ఛాంబర్ ఆఫ్ కామర్స్' ఎన్నికల నోటిఫికేషన్‌ను శుక్రవారం వర్తక సంఘ భవన్‌లో ఎన్నికల అధికారి అడ్వకేట్ పీబీశ్రీరాములు విడుదల చేశారు. ఎన్నిలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి 28 వరకు నామినేషన్ల స్వీకరణ, 30న నామినేషన్ల పరిశీలన, 31న ఉపసంహరణలు అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల ప్రకటన ఉంటుందని తెలిపారు. నవంబరు 16న ఉదయం8గంటల నుంచి మధ్యాహ్నం4 గంటల వరకు ఎన్నికల నిర్వహణ, సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లలెక్కింపు ఉంటుందన్నారు. అదేరోజు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డుపై ప్రదర్శించారు. ఎన్నికలలో 18 శాఖల నుంచి 1305 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్‌కామర్స్ అధ్యక్షుడు చిన్ని క్రిష్ణారావు, సెక్రెటరీ మెంతుల శ్రీశైలం ఉపాధ్యక్షుడు సోమా నర్సింహరావు, సహాయ కార్యదర్శి మన్నెం క్రిష్ణ తదితరులు ఉన్నారు.

శతాబ్ది ఉత్సవాలకు భారీగా జనసమీకరణ

ఖమ్మంసంక్షేమ విభాగం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీపీఐ శతాబ్ది ఉత్సవాలకు భారీగా జనసమీకరణ జరపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోవిందరావు కోరారు. శుక్రవారం గిరిప్రసాద్‌భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, కూచిపూడి రవి, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్, మామిళ్లసుదర్శరెడ్డి, అమరనేని వీరభద్రం, నల్లమోతు నర్సింహారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో శుక్రవారం గోవు-పర్యావరణ, పరిరక్షణ శాస్త్రీయవిజ్ఞానంలో జిల్లాస్థాయి గో విజ్ఞాన పరీక్షలు నిర్వహించారు. రైతు హలము, ఆవు ఫలము దేశాభివృద్ధికి మూల స్తంభాలు అని నిర్వాహకుల విద్యార్థులకు వివరించారు. ఈ పరీక్షకు నగరంలోని 12 పాఠశాలల నుంచి 140మంది విద్యార్థులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతీ పాఠశాల నుంచి ప్రథమ, ద్వితీయ బహుమతులుగా జ్యూట్ బ్యాగ్స్‌లను పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎకోక్లబ్ ఎన్విరాన్మెంటల్ సొసైటీ ఫౌండర్ అండ్ ప్రెసిడెంట్ కడవెండి వేణుగోపాల్ అందించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ గోసేవ చైతన్య కిషోర్, రామకృష్ణ విద్యాలయం ప్రధానాచార్యులు సంతోష్ అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఖమ్మానికి ఏపీ వీఐపీలు!

(5వ పేజీ తరువాయి)

కూడా ఇదే సభ్యులు మళ్లీ గ్రామీణ సిండికేట్‌గా మారారు. శుక్రవారం నాలుగు దుకాణాలకు దరఖాస్తు చేశారు. అయితే ఈ సంవత్సరం మద్యం టెండర్ల దరఖాస్తుల్లో రెగ్యులర్ మద్యం వ్యాపారం చేస్తూ సిండికేట్‌గా వ్యవహరించే వారితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసేవారు. చిన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారు సైతం సిండికేట్‌గా మారుతున్నారు. బడా మద్యం వ్యాపారులకు సైతం వీరు సవాల్ విసురుతున్నారు. ఒక్కొక్కరు రూ.15వేల నుంచి రూ.1లక్ష వరకు పెట్టుబడి పెట్టి సిండికేట్‌గా మారుతున్నారు. మద్యం టెండర్ల లక్కీ డ్రాలో అదృష్టం కలిసి రావాలని.. మహిళల పేర్లతో ఎక్కువగా దరఖాస్తులు నమోదు జరుగుతున్నాయి. కాగా.. గ్రామీణ ప్రాంతాల నుంచి సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేస్తున్నవారి తీరును మద్యం వ్యాపారులు గమనిస్తున్నారు. లక్కీ డ్రాలో కొత్త వారికి మద్యం దుకాణాలు దక్కితే వారి నుంచి కొనుగోలు చేసేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

ఆదాయ వనరుగా గేదెల పెంపకం

» సరైన ప్రణాళికలు లేకుండా పనులు చేయవద్దని ఆగ్రహం

» అదనపు కలెక్టర్ శ్రీజ

బోనకల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గేదెల పెంపకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ పి.శ్రీజ ఆకాంక్షించారు. బోనకల్ రైతు వేదికలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ఇందిరా డెయిరీ లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో 60వేల మంది లబ్ధిదారుల సభ్యత్వం లక్ష్యంగా ఉండడంతో ఇప్పటికే 20వేల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మొదటి విడతలో 125 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 2గేదెల చొప్పున పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గేదెల ఆరోగ్య పర్యవేక్షణను పశుసంవర్ధకశాఖ చూస్తుందని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో రోజువారీ పదివేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందన్నారు. ఈ నెలాఖరులోగా బీఎంసీల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులో తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. చిన్నపాటి పాడి పరిశ్రమలను నిర్వహించే స్థాయికి మహిళా రైతులు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీఎం శ్రీనివాసరావు, డెయిరీ ప్రత్యేకాధికారి రాజారావు, ఏపీడీ జయశ్రీ, ఏపీఎంలు లక్ష్మణరావు, తిరుమలరావు పాల్గొన్నారు.

సరైన ప్రణాళికలు లేకుండా పనులా?

బోనకల్‌లో పాలశీతలీకరణ కేంద్ర నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రవేశం, బయటకు వచ్చే ద్వారాలు సక్రమంగా పెట్టకుండా అస్తవ్యస్తంగా నిర్మాణాలు పూర్తి చేస్తే ఎలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల సేకరణ కోసం వచ్చే వాహనాల రాకపోకలు ఎలా సాగుతాయని మండిపడ్డారు.

వైద్యచికిత్సకు ఎల్‌వోసీ అందించిన మంత్రి తుమ్మల



ఎల్‌వోసీ అందజేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంఅర్బన్,అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని వైద్యచికిత్సకోసం అవసరమైన ఎల్‌వోసీని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన పి.శ్లోక ఐదేళ్లుగా ఎముకల ట్యూమర్‌తో బాధపడుతోంది. ఇప్పటికే ఎడమచేతిని తొలగించటంతోపాటు వెన్నెముకకు సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం ఊపిరితిత్తుల్లోకూడా ట్యూమర్ ఏర్పడింది. తండ్రికూడా లేక పోవటంతో ఆర్థికసాయం చేయాలంటూ బాలిక కుటుంబ సభ్యులు తుమ్మలను వేడుకున్నారు. స్పందిచిన మంత్రి తుమ్మల బాలిక వైద్య చికిత్స, కృత్రిమ చేతి అమరిక కోసం లక్ష రూపాయల ఎల్ఓసీ ఇప్పించారు. పైచదవుల విషయంలో సాయం చేస్తానని హామీ ఇచ్చారు. శ్లోక ప్రస్తుతం ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది.

వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మంరూరల్, అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పొన్నేకల్లు గ్రామంలో సామాజికవేత్త పాలపాటి యేసు సంస్మరణార్థం వారి కుమారుడు డాక్టర్ పాలపాటి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో వడిద్యా రవికుమార్, పీరునాయక్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. వైద్యులు క్రాంతి కుమార్, శేఖర్, కీర్తి, గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కంటి పరీక్షలు చేసి కంటి అద్దాలను అందజేశారు. సుమారు 5వందల మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు: ఏవో

నేలకొండపల్లి, అక్టోబరు17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయయాంత్రీకరణలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందించనున్న వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తులను కోరుతున్నట్లు మండల వ్యవసాయాధికారి ఎం.రాధ శుక్రవారం ఓప్రకటనలో కోరారు. యాంత్రీకరణ పథకంలో భాగంగా మండలానికి మాన్యువల్ స్ప్రేయర్లు,బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, పవర్ టిల్లర్స్ బ్రష్ కట్టర్, పవర్ వీడర్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ, మిగిలిన రైతులకు 40 శాతం సబ్సిడీపై పరికరాలను ఇవ్వనున్నట్లు ఎంఏఓ రాధ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈనెల21నుంచి 24వ తేదీ వరకు వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుతో పాటుగా ఆధార్, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు రెండు తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు.

వైరా మునిసిపాలిటీలో అవినీతి కంపు!

(5వ పేజీ తరువాయి)

అడ్డూ అదుపు లేకుండాపోయింది. రాజకీయ అండదండలతో కొందరు సిబ్బంది మునిసిపల్ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని ఆడిందే ఆటగా, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. రూ.54లక్షల సెల్ఫ్ చెక్కులపై సంతకం చేసి ఆగస్టు 22న బదిలీ అయిన కమిషనర్ వేణు బదిలీని నిలిపి వేయించే విషయంలో.. మునిసిపాలిటీలోని ఒక తాత్కాలిక ఉద్యోగి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అయితే వేణు స్థానంలో ప్రస్తుత కమిషనర్ గురులింగం బాధ్యతలు చేపట్టాక.. సదరు ఉద్యోగి సలహాలు తీసుకోవాలని సదరు ప్రజాప్రతినిధి ఈ కమిషనర్‌కు సూచించారనే ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న స్నేహలత మొగిలి మునిసిపాలిటీలో అవినీతి ఆరోపణలపై నలుగురికి పైగా సిబ్బందిని విధుల నుంచి తప్పించారు. ఆ సమయంలోనూ నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడలేదు. అర్హత లేని అప్పటి ఇన్‌చార్జ్ ఏఈ అనితను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఆ సమయంలో 11వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా ఒక ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకును కూల్చివేశారు. అప్పటి మునిసిపల్ చైర్మన్ జైపాల్, కమిషనర్ అనిత, తాత్కాలిక ఉద్యోగి నాగరాజుపై ఆరోపణలు రావడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. చివరికి హైకోర్టు నుంచి వారు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కపట రాజకీయాలు







ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్షనాయకులు, తిరుమలాయపాలెంలో నిరసన, మాట్లాడుతున్న మల్లయ్య

ఖమ్మంఅర్బన్ అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై బీజేపీ కపట రాజకీయాలు చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సీపీఎం జిల్లా కార్యాలయం నుంచి సరితా క్లినిక్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన జరిగిన సభలో నున్నానాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకమిటీ నాయకులు బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, నందిపాటి మనోహర్,బండారు రమేష్,తుమ్మా విష్ణువర్ధన్,పిన్నింటి రమ్య, ఎంఎ జబ్బార్ షేక్ మీరాసాహెబ్ పాల్గొన్నారు.

వామపక్ష విద్యార్థి సంఘాల మద్దతు

బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు పూర్తి మద్దతు తెలుపుతు న్నట్లు ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ,పీడీఎస్‌యూ,పీడీఎస్‌యూ జార్జిరెడ్డి విద్యార్థిసంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, మస్తాన్, సుధాకర్, లక్ష్మణ్‌జార్జి, మందసురేష్ తెలిపారు.శుక్రవారం సీపీఐజిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవనంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.

రాష్ట్ర వ్యాప్త బీసీ బంద్‌ను విజయవంతం చేయండి

కామేపల్లి: బీసీబంద్‌ను విజయవంతం చేయాలని కాంగ్రెస్ బీసీసెల్ మండల అధ్యక్షుడు చల్లా మల్లయ్య పిలుపునిచ్చారు.శుక్రవారం కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈసమావేశంలో బొడ్డు లక్ష్మినారాయణ, మేకపోతుల మహేష్, వరికొల్లు సైదులు, దేవండ్ల రామక్రిష్ణ, దేవండ్ల నాగేశ్వరరావు, చామంతుల విశ్వనాథం, చల్లా రాము, బండి లక్ష్మినర్సు, తరక రవి, కమటం వెంకటేశ్వర్లు ఉన్నారు.

బీసీల సత్తాచూపుతాం

ఖమ్మంచర్చికాంపౌండ్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేకపోతే బీసీల సత్తా చూపుతామని పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం ఖమ్మంలో బీసీ నాయకులు గుండాల కృష్ణ ఆధ్వర్యంలో బంద్ సన్నాహక సమావేశం, నగరంలో బంద్ విజయవంతం కోసం ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమాల్లో బీసీలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలోఅఖిలపక్షనాయులు యర్రా శ్రీనివాసరావు, వైవిక్రమ్, మేకల శ్రీను, కూరపాటి వెంకటేశ్వర్లురాఘవులు, అశోక్, శ్రీనివాస్,వీరభద్రం,గుండాల కృష్ణ, బొమ్మ రాజేశ్వరరావు, వెంకటరమణ తదిరులు

బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి

తిరుమలాయపాలెం: నేడు జరిగే బీసీ బందును జయప్రదం చేయాలని మాస్‌లైన్ జిల్లానాయకుడు తిమ్మిడి హనుమంతరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకరవాయిలో పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో కొత్తపల్లి శివయ్య, మధు, కార్తీక్, కొలిశెట్టి బిక్షం, వెంకన్న, యల్లయ్య, పాల్గొన్నారు.

బీసీల ద్రోహి బీజేపీ

ఖమ్మంరూరల్:బీజేపీ బీసీలకు ద్రోహం చేస్తుందని సీపీఎం జిల్లా నాయకులు ఊరడి సుదర్శన్‌రెడ్డి, నండ్రా ప్రసాద్ ఆరోపించారు. తెలంగాణలో త్వరలో జరగబోయే స్థానికసంస్థల ఎన్నిల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో నాయకులు పి.సంగయ్య, నాగేశ్వరరావు, నందిగామ కృష్ణ, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నేటి రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలి

వైరా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 42శాతం బీసీ రిజర్వేషన్ల కోసం శనివారం నిర్వహించే రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి శుక్రవారం ఖమ్మంలో ఒక వినతిపత్రం సమర్పించారు. ఆ తర్వాత వైరాలో జరిగిన బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో కృష్ణమాచారి పాల్గొని ప్రసంగించారు. నేడు నిర్వహించే తెలంగాణ రాష్ట్ర బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు లింగబోయిన పుల్లారావు, శివరామకృష్ణ, బొడ్డు కృష్ణయ్య, మాచర్ల యుగంధర్, దరిపల్లి శ్రీనివాస్, అమ్మిక రామారావు, నాగేశ్వరరావు, గద్దే వెంకట్రామయ్య, అమృతం మల్లికార్జున్, సుగుణ, శ్రీదేవి, సతీష్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

చింతకాని, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు రూ.20 లక్షలతో మంజూరైన రైల్వే కాలనీ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శుక్రవారం మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ రఘు, కార్యదర్శి ఉపేందర్, నాయకులు కాంపెల్లి శేషగిరిరావు, కంభం వీరభద్రం, బండి నరేష్, వెంకటరత్నం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్లూరులో మహాఅన్నదాన కార్యక్రమం

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పెద్దచెరువు కట్టపై కొలువైన అంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కనదుర్గ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ తరుపున ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు, తహసిల్దార్ పి సాంబశివుడులు ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర చౌదరి, భూక్యా శివకుమార్ నాయక్, పంతులు నాయక్, పొన్నూరు వెంకటేశ్వరరావు, తోట సుబ్బారావు భక్తులు పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ లైన్ వ్యవస్థ మధిరకు ఓ వరం

మధిర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పెద్ద పెద్ద పట్టణాల్లో ఉండే భూగర్భ విద్యుత్ లైన్ వ్యవస్థ మధిరకు రావడం ఓ వరం అని ఎన్పీడీసీఎల్ డైరక్టర్ ఆఫ్ ప్రాజెక్ట్స్ వంగూరి మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మధిరలో 28 కోట్లతో చేపట్టనున్న భూగర్భ విద్యుత్ లైన్లు వేసే ప్రదేశాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరలోనే విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదగా ప్రాజక్టుకు శంఖుస్తాపన కార్యక్రమం ఉంటుందని అన్నారు. పర్చెస్ సీఈ తిరుమలరావు, వైరా డీఈ బండి శ్రీనివాసరావు, కనస్ట్రక్షన్స్ డీఈ భద్రు పవార్, మధిర ఏడీఈ అనురాధ, ఎఈ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం

తల్లాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో ఎల్వీప్రసాద్ ఐ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవతం అయింది. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 150మందికి కంటి పరీక్షలు నిర్వహించి 102మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. శిబిరంలో ఎల్వీప్రసాద్ ఐ సంస్థ అడ్మినిస్ట్రేటర్ శ్రీదేవి చంద్రరావు, విజన్‌సెంటర్ కో ఆర్డినేటర్ సాయితేజ, టెక్నీషియన్లు రాయపాటి వినోద, స్నేహచైతన్య, విజయలక్ష్మి, జ్యోతి సారిక వైద్యసేవలందించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, స్థానిక ప్రముఖులు అపతి వెంకటరామారావు, చింతల నరేష్, గాదె కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు సత్వర పరిష్కారం

ఏన్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యకు అధికారులు స్పందించి సత్వరమే పరిష్కరించారు. జన్నారం సబ్‌స్టేషన్ నుంచి శ్రీరామగిరి వరకు వెళ్లే ఫీడర్ అరికాయలపాడు టు జన్నారం మధ్యవాగులో గురువారం రాత్రి వైరు తెగిపడింది. ఈవిషయాన్ని వెంటనే గ్రామస్థులు విద్యుత్ అధికారులకు తెలిపారు. వెంటనే విద్యుత్ సిబ్బంది లైన్‌ను లాగడానికి సాహసం చేశారు. సమస్యను పరిష్కరించినందుకు విద్యుత్‌శాఖ సిబ్బందికి ప్రజలు అభినందిస్తున్నారు.

రైతులకు విత్తన కంపెనీలు కూలీ ఖర్చులు చెల్లించాలి

వైరా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విత్తనోత్పత్తి సంస్థల యాజమాన్యాలు, ఆర్గనైజర్లు విధిగా రైతులకు అగ్రిమెంట్ ఇవ్వాలని, కూలీల ఖర్చులు కంపెనీలు భరించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఇదే అంశంపై ఈనెల 23న వైరాలో విత్తన మొక్కజొన్న రైతు సదస్సు నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం వైరాలో జరిగిన మొక్కజొన్న రైతుల సమావేశంలో రాంబాబు మాట్లాడారు. గత సంవత్సరం కంపెనీల ప్రతినిధులు అవసరం కంటే మించి ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగుచేయించటం వలన కూలీలు దొరక్క పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, సాంబశివరావు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఏన్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక మార్కెట్ కార్యాలయంలో నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ.. మార్కెట్ యార్డుకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను కల్పించి మార్కెట్ అభివృద్ధికి కృషిచేస్తానని హామి ఇచ్చారు. మార్కెట్ ఆదాయం పెంపుకు పాలకవర్గం కృషిచేయాలని కోరారు రైతులను రాజుచేయడం కోసం ప్రభుత్వం అన్నిరకాల సౌకర్యాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు.

ఆదాయ వనరుగా గేదెల పెంపకం

» సరైన ప్రణాళికలు లేకుండా పనులు చేయవద్దని ఆగ్రహం
» అదనపు కలెక్టర్ శ్రీజ

బోనకల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గేదెల పెంపకాన్ని ఆదాయ వనరుగా మార్చుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని అదనపు కలెక్టర్ పి. శ్రీజ ఆకాంక్షించారు. బోనకల్ రైతు వేదికలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి ఇందిరా డెయిరీ లబ్ధిదారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 60 వేల మంది లబ్ధిదారుల సభ్యత్వం లక్ష్యంగా ఉండడంతో ఇప్పటికే 20వేల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మొదటి విడతలో 125 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 2గేదెల చొప్పున పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. గేదెల ఆరోగ్య పర్యవేక్షణను పశు సంవర్ధక శాఖ చూస్తుందని తెలిపారు. ఎర్రుపాలెం మండలంలో రోజువారీ పది వేల లీటర్ల పాల సేకరణ జరుగుతుందన్నారు. ఈ నెలాఖరులోగా బీఎమ్‌సీల నిర్మాణాలను పూర్తి చేసి అందుబాటులో తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. చిన్నపాటి పాడి పరిశ్రమలను నిర్వహించే స్థాయికి మహిళా రైతులు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సన్యాసయ్య, డీపీఎం శ్రీనివాసరావు, డెయిరీ ప్రత్యేకాధికారి రాజారావు, ఏపీడీ జయశ్రీ, ఏపీఎంలు లక్ష్మణరావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా డెయిరీ లబ్ధిదారులతో మాట్లాడుతున్న శ్రీజ



పాలశీతలీకరణ కేంద్ర నిర్మాణ పనులను విచారిస్తున్న శ్రీజ

సరైన ప్రణాళికలు లేకుండా పనులా?

బోనకల్‌లో పాలశీతలీకరణ కేంద్ర నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ప్రవేశం, బయటకు వచ్చే ద్వారాలు సక్రమంగా పెట్టకుండా అస్తవ్యస్తంగా నిర్మాణాలు పూర్తి చేస్తే ఎలా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాల సేకరణ కోసం వచ్చే వాహనాల రాకపోకలు ఎలా సాగుతాయని మండిపడ్డారు. ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తారా? అంటూ మందలించారు. ఎంఆర్‌సీ నుంచి ప్రవేశం ఉండేలా చూడాలని ఆదేశించారు. ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలలో భవిత కేంద్ర భవన నిర్మాణ పనులను పరిశీలించారు.

ఖమ్మానికి ఏపీ వీఐపీలు!

(5వ పేజీ తరువాయి)

కూడా ఇదే సభ్యులు మళ్లీ గ్రామీణ సిండికేట్‌గా మారారు. శుక్రవారం నాలుగు దుకాణాలకు దరఖాస్తు చేశారు. అయితే ఈ సంవత్సరం మద్యం టెండర్ల దరఖాస్తుల్లో రెగ్యులర్ మద్యం వ్యాపారం చేస్తూ సిండికేట్‌గా వ్యవహరించే వారితో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిరు వ్యాపారాలు చేసేవారు. చిన్న చిన్న ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వారు సైతం సిండికేట్‌గా మారుతున్నారు. బడా మద్యం వ్యాపారులకు సైతం వీరు సవాల్ విసురుతున్నారు. ఒక్కొక్కరు రూ.15వేల నుంచి రూ.1లక్ష వరకు పెట్టుబడి పెట్టి సిండికేట్‌గా మారుతున్నారు. మద్యం టెండర్ల లక్కీ డ్రాలో అదృష్టం కలిసి రావాలని.. మహిళల పేర్లతో ఎక్కువగా దరఖాస్తులు నమోదు జరుగుతున్నాయి. కాగా.. గ్రామీణ ప్రాంతాల నుంచి సిండికేట్‌గా మారి దరఖాస్తులు చేస్తున్నవారి తీరును మద్యం వ్యాపారులు గమనిస్తున్నారు. లక్కీ డ్రాలో కొత్త వారికి మద్యం దుకాణాలు దక్కితే వారి నుంచి కొనుగోలు చేసేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

విత్తన కంపెనీల నుంచి విధిగా ఒప్పంద పత్రం తీసుకోవాలి

వైరా, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విత్తన మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులు ఆయా విత్తన కంపెనీల నుంచి విధిగా ఒప్పంద పత్రాలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజూఖాన్ సూచించారు. మండలంలోని ఖానాపురం గ్రామంలో శుక్రవారం విత్తన మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కపాస్‌కిసాన్‌యాప్‌లో స్లాట్ బుకింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోలు ఎస్.సైదులు, రాజేష్, పాల్గొన్నారు.

వైరా మునిసిపాలిటీలో అవినీతి కంపు!

(5వ పేజీ తరువాయి)

అడ్డూ అదుపు లేకుండాపోయింది. రాజకీయ అండదండలతో కొందరు సిబ్బంది మునిసిపల్ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని ఆడిందే ఆటగా, పాడిందే పాటగా వ్యవహరిస్తున్నారు. రూ.54లక్షల సెల్ఫ్ చెక్కులపై సంతకం చేసి ఆగస్టు 22న బదిలీ అయిన కమిషనర్ వేణు బదిలీని నిలిపి వేయించే విషయంలో.. మునిసిపాలిటీలోని ఒక తాత్కాలిక ఉద్యోగి తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అయితే వేణు స్థానంలో ప్రస్తుత కమిషనర్ గురులింగం బాధ్యతలు చేపట్టాక.. సదరు ఉద్యోగి సలహాలు తీసుకోవాలని సదరు ప్రజాప్రతినిధి ఈ కమిషనర్‌కు సూచించారనే ప్రచారం జరుగుతోంది. నాలుగేళ్ల క్రితం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఉన్న స్నేహలత మొగిలి మునిసిపాలిటీలో అవినీతి ఆరోపణలపై నలుగురికి పైగా సిబ్బందిని విధుల నుంచి తప్పించారు. ఆ సమయంలోనూ నిధుల స్వాహాకు అడ్డుకట్ట పడలేదు. అర్హత లేని అప్పటి ఇన్‌చార్జ్ ఏఈ అనితను ఇన్‌చార్జ్ కమిషనర్‌గా నియమించారు. ఆ సమయంలో 11వ వార్డులో నిబంధనలకు విరుద్ధంగా ఒక ఓహెచ్‌ఎస్‌ఆర్ వాటర్ ట్యాంకును కూల్చివేశారు. అప్పటి మునిసిపల్ చైర్మన్ జైపాల్, కమిషనర్ అనిత, తాత్కాలిక ఉద్యోగి నాగరాజుపై ఆరోపణలు రావడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. చివరికి హైకోర్టు నుంచి వారు ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

» సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు

మధిర రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లఅమలుకు అడ్డుగా ఉన్నది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు ఆరోపించారు. శుక్రవారం మధిరలోని వైఎస్సార్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం నాయకులు శీలం నర్సింహారావు, పడకంటి మురళీ, మందా సైదులు, అనుమోలు భాస్కర్‌రావు, ఉపేంద్రరావు, శ్రీరాములు, రామకిషోర్ పాల్గొన్నారు.

వైరా: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును బీజేపీ రాజకీయ కోణంలో చూడడాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీపీఎం డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు మాట్లాడారు. పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, నాయకులు సుంకర సుధాకర్, మచ్చా మణి, పారుపల్లి కృష్ణారావు, సుధాకర్, తోట నాగేశ్వరరావు, బాజోజు రమణ పాల్గొన్నారు.

బోనకల్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ శుక్రవారం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సీపీఎం నాయకులు కిలారు సురేష్, బంధం శ్రీనివాసరావు, బోయినపల్లి వీరబాబు, నీలకంఠ రాము, నిమ్మతోట ఖానా,సునిత పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: బీసీ రిజర్వేషన్లపై బీజేపీ నాటకం ఆడుతుందని, కేంద్రంలో అడ్డుకుంటూ రాష్ట్రంలో బంద్‌కు మద్దతు ఇస్తూ రెండు నాల్కల ధోరణిని ప్రదర్శిస్తుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్‌లు అన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు.



మధిరలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాల్లోనే పంటలు అమ్ముకోవాలి: పుల్లయ్య

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో దిగుబడి అయిన తమ పంటలకు గిట్టుబాటు ధర పొందేందుకు ప్రభుత్వం తరుపున ఏర్పాటైన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య రైతులను కోరారు. శుక్రవారం కల్లూరులోని రైతువేదిక ప్రాంగణంలో కిసాన్ కపాస్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతు కిసాన్ కపాస్ యాప్ ద్వారా తమ ఆధార్ కార్డుతో ఆన్లైన్ చేసుకుని పత్తిని అమ్ముకోవచ్చునని సూచించారు. వ్యవయసాయ అధికారిణి రూపా, ఏఈఓలు దీపిక పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: పత్తి రైతులు దళారుల నుంచి మోసపోకుండా కపాస్ కిసాన్‌యాప్ ద్వారా పత్తి అమ్మకాలను నేరుగా జరుపుకోవచ్చని ఏవో బోయినపల్లి సాయిశివ అన్నారు. మండలంలో పత్తి వేసి రైతులందరు తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అయి స్లాట్‌బుక్‌చేయడం ద్వారా మాత్రమే అమ్మకాలు జరపాల్సి ఉంటుదన్నారు. దీనికోసం మొబైల్‌నెంబరు సరిచూసుకుని తమ రైతేవేదికలో ఏఈవోలను సంప్రదించాలన్నారు. సీసీఐ కొత్తనిబంధనల ప్రకారం కపాస్‌కిసాన్‌యాప్‌లో రైతుల వివరాలు నమోదుచేసుకోవడంతోపాటు స్లాట్‌బుకింగ్‌ను తప్పనిసరిచేసిందన్నారు.

వ్యవసాయ యంత్రాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఏన్కూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ ద్వారా సబ్సిడీపై అందించే యంత్రాల కోసం రైతులు దరఖాస్తులు చేయాలని ఏవో నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు మాన్యువల్ స్ప్రేయర్లు, పవర్‌స్ప్రేయర్లు, పవర్‌టిల్లర్లు, బ్రష్‌కట్టర్లు, పవర్ వీడర్, తైవాన్‌స్ప్రేయర్లు, రోటవేటర్లు కోసం ఈనెల 24వరకు దరఖాస్తుచేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు 50శాతం సబ్సిడీపై అందించన్నునట్లు తెలిపారు.

ఉన్నత చదువులకు ఎల్లప్పుడూ సాయపడతాం: రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువులను ప్రోత్సహించేందుకు మాజీ ఎంపీపీ మట్టా ఆరోగ్యమ్మ స్ఫూర్తితో ఎల్లప్పుడూ ఉన్నత చదువులకు సాయపడుతున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి మునిసిపాలిటీ నిధులు రూ.6లక్షల విలువైన 10కంప్యూటర్లను స్థానిక ప్రభుత్వ బాలికల, బాలుర జూనియర్ కళాశాలలకు శుక్రవారం ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు తీర్చిదిద్దేలా గురువులు బాధ్యతగా బోధన సాగించాలని, విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యం పెంపొందించడం కోసం ఈ కంప్యూటర్లను అందించామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహా, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కారేపల్లిలో సీపీఐ మండల కౌన్సెలింగ్ సమావేశం

కారేపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో శనివారం కారేపల్లి, కామేపల్లి మండాలలకు చెందిన సీపీఐ మండల కౌన్సిలింగ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా రైతు సంఘం నాయకులు పుచ్చాకాయల శ్రీనివాసురావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరగనున్న ఈ కౌన్సిల్ సమావేశంలో సీపీఐ పార్టీ జాతీయ సమితి నాయకులు బాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబాబు, ఏపూరి లతదేవి, రావి శివరామకృష్ణ, ఉంగారాల సుధాకర్, మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ పాల్గొంటారన్నారు.

చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసనగా ధర్నా



తల్లాడ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ మీద దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదుచేసి వెంటనే అరెస్టుచేయాలని ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లాడలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ జాతీయనాయకుడు ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ.. చీఫ్ జస్టిస్ గవాయ్‌మీద దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి వారికి కూడా శిక్ష పడేలా స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. నాయకులు ఎక్కిరాల నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మధిర: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టీస్ గవాయిపై కోర్టు హాల్‌లో దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు శుక్రవారం మధిర తహసీలల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకు వినతిపత్రం ఇచ్చారు. సాక్షాత్తు ప్రధాన న్యాయమూర్తి పై దాడి చేస్తే ఇంత వరకు కేసు నమోదు చేయక పోతే సామాన్యుడి గతి ఏమిటని అన్నారు. అత్యున్నత న్యాయ పీఠం పై సామాన్యుడు కూర్చుంటే ఓర్వలేని వారు చేసిన దాడి అని వెంటనే ఆ వ్యక్తిని అరెస్ట్ చేయాలని అన్నారు.

అతివృష్టితో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

» క్షేత్రస్థాయిలో పరిశీలించిన సీపీఎం శ్రేణులు

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): అతివృష్టితో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదిరి రమేష్, సత్తుపల్లి డివిజన్ సీపీఎం కార్యదర్శి శీలం సత్యనార యణరెడ్డి, సీనియర్ నాయకుడు తాత భాస్కరరావులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. కల్లూరు మండల పరిధిలోని పెద్దకోరుకొండి, చెన్నూరు గ్రామాల్లో శుక్రవారం వారు అతివృష్టితో నష్టపోయిన వరి, పత్తి పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాదిరి రమేష్ మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా అందులో వరి 2.50 లక్షలు, పత్తి 1.80 లక్షలు, మిర్చి 40 వేల ఎకరాలు, మొక్కజొన్న 40వేల ఎకరాలు, పెసర 18 వేల ఎకరాల్లో సాగు చేశారని వివరించారు. ఈ పంటలన్ని అధిక వర్షాలతో త్రీవంగా నష్టం జరిగిందన్నారు. ప్రకృతి వైపరిత్యాలతో చిక్కుకున్న రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వాలు రైతులను ఆదుకోని పక్షంలో ఈ నెల 22, 23, 24 తేదిల్లో తహసిల్దార్ కార్యాలయాల ఎదుట రైతులకు మద్దతుగా ధర్నాలు నిర్వహించటం జరుగుతుందని హెచ్చారించారు. సీపీఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, డివిజన్ కార్యవర్గ సభ్యులు తన్నీరు కృష్ణార్జునరావు, సామినేని హనుమంతరావు, అంజయ్య, రైతులు మోహన రెడ్డి, హుస్సేన్,నరిసింహారావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా డీసీసీ ఎంపికలు

మధిర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ముందుఎన్నడు లేని విదంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష ఎంపిక కాంగ్రెస్ కార్యకర్తల అభిప్రాయం మేరకు అత్యంత ప్రజాస్వామ్య బద్దంగా ఎంపిక జరుగుతుందని ఏఐసిసి అబ్జర్వర్ మహేంద్రన్ అన్నారు. శుక్రవారం మధిర రెడ్డి గార్డెన్స్‌లో మధిర నియోజకవర్గ ఏబ్లాక్ ముఖ్యనాయకులు కార్యకర్తల అభిప్రాయాలను ఆయన తీసుకున్నారు. ఏఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కార్యకర్తల అభిప్రాయం మేరకే డిసిసి ఎంపికలు జరగాలని ఇంతకు ముందు ఉన్నవారు కాకుండా కొత్త వారికి అవకాశం ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అన్నారు.